76809 94755 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2019-21

V Media House- Vijayawada
CORPORATE
- Meet-Ups
- Product Launches
- Seminars
- Training

MEDIA
- Press Briefs
- Video Interviews
- Consulting
- Advertisements

Ph : 7680994755, 73860 00779

రాజధాని వార్తలు

Voice of Voiceless

అమరావతి సంపుటి : 4 సంచిక 24, పేజీలు 4, వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక సోమవారం 4 - ఆదివారం 10 మార్చి, 2019

పేజీలు2లో...

ఎన్నికల స్టంటేనా ?

పేజీలు3లో...

మంచి కోసం సమతుల్యం

పేజీలు3లో...

ఆంధ్రప్రదేశ్‌లో గుంటూరు జిల్లా చరిత్ర

పేజీలు4లో...

స్వదేశంలో సింగం

హోదా ఇచ్చేవారికే మా మద్దతు : జగన్

కాంక్లేవ్ 2019 మాట్లాడుతున్న వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి

న్యూఢిల్లీ : కేంద్రంలో ఏ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసినా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామంటే వారికి మద్దతు ఇస్తామని వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలుగు రాష్ట్రాన్ని విభజించి, సవ్యాంధ్రకు అన్నీ చేస్తామని ఆశల పల్లకిలో ఊరేగించి చివరికి నట్టేట ముంచారని, అందుకే కేంద్రంలోని అధికార బీజేపీ, విపక్ష కాంగ్రెస్‌లపై ప్రజలకు నమ్మకం పోయిందని ఆయన విమర్శించారు. ఢిల్లీలో ఇండియాటుడే గ్రూప్ నిర్వహిస్తున్న 'కాంక్లేవ్ 2019'లో ఆయన శనివారం ఉదయం మాట్లాడారు. అన్నివనరులు పుష్కలంగా ఉన్న ఏపీకీ ప్రత్యేక హోదా ఎందుకు? అన్న టీవీ ప్రతినిధి ప్రశ్నకు జగన్ దీటుగా సమాధానమిచ్చారు. ప్రత్యేక హోదా ప్రజలు అడిగింది కాదని, ప్రజల సంక్షేమాన్ని కోరుతూ మేమే ఇస్తామని కాంగ్రెస్, బీజేపీలు ఇచ్చిన హామీ అని గుర్తు చేశారు. ఆ హామీని విస్మరించి కాలయాపన చేస్తుంటే ప్రజలకు పార్లమెంటుపై విశ్వాసం పోతుందన్నారు. 60 ఏళ్ల ఉమ్మడి అభివృద్ధికి హైదరాబాద్ ఉదాహరణ అన్నారు. ఇప్పుడు ఏపీలో డిగ్రీ తీసుకున్న ఏ ఉద్యోగార్థి అయినా ఉపాధి వెతుక్కుంటూ హైదరాబాద్ వెళ్లాల్సి వస్తోందన్నారు. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాలకు దీటుగా ఏపీ అభివృద్ధి చెందాలంటే అది ప్రత్యేక హోదా తోనే సాధ్యమన్నారు. పన్ను మినహాయింపు, పరిశ్రమలు వచ్చి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. అందువల్ల హోదా ఇచ్చి తీరాల్సిందేనన్నారు. ఎంతో ప్రాధాన్యం ఉన్న హోదా ఇస్తామంటే కేంద్రంలోని ఏ పార్టీకైనా మద్దతు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. 'అక్కడ ప్రధాని మోడీయా, రాహుల్‌గాంధీయా అన్నది కాదు, హోదా ఇచ్చే వారికి మద్దతు ఇవ్వాలన్నది మా నిర్ణయమని స్పష్టం చేశారు. అంటే కేంద్రంలో మీపై ఆధారపడే బలహీనమైన ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నారా? అన్న ప్రశ్నకు జగన్ నవ్వుతూ సమాధానమిస్తూ, తమకు తమ రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్‌ను ఆంధ్రరాష్ట్ర ప్రజలు నమ్మరన్నారు.

విశాఖ రైల్వేజోన్ కోసం

మరో పోరాటం?

జోన్ ఇచ్చినట్టే ఇచ్చి, విశాఖకు ప్రాధాన్యత ఇవ్వకుండా విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలను భువనేశ్వర్‌కు అనుసంధానం చేయడంతో రాష్ట్ర ప్రజలు తీవ్రంగా కలత చెందుతున్నారు. ఇప్పటికీ విభజన హామీలను ఏమాత్రం అమలు చేయని కేంద్రం శుక్రవారం ప్రధాని బహిరంగ సభకు ఎదురవుతున్న నిరసనలను చల్లార్చేందుకు ప్రకటించిన ఈ రైల్వేజోన్ స్థానిక ప్రజలకు ఏమాత్రం సంతృప్తి కలిగించలేకపోయింది. రాబడిలో దేశంలోనే మూడో స్థానంలో ఉన్న 125 ఏళ్ల చరిత్ర కలిగిన వాల్తేరు స్టేషన్‌ను నిర్వీర్యం చేయడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. విశాఖ బహిరంగ సభలో మోడీ ప్రసంగిస్తూ ఉత్తరాంధ్ర కల నెరవేరిందని చెప్పడంపై గుర్రుగా ఉన్నారు. రాష్ట్రాల మధ్య చిచ్చుపెట్టేదిగా ఉందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేయగా, భువనేశ్వర్ డివిజన్ వివక్షతో విసిగిపోయిన ఉత్తరాంధ్ర వాసులు సమగ్ర విశాఖ జోన్ కోసం మరో పోరాటానికి సన్నద్ధమవుతున్నారు.



రాజధాని వార్తలు బ్యూరో : రాష్ట్రంలోని జిల్లాలను రెండు రైల్వే జోన్లగా విభజిస్తూ కేంద్ర మంత్రి పియూష్ విశాఖలో ప్రధాని మోడీ బహరంగసభకు ఒక్కరోజు ముందు ప్రకటన చేశారు. ఒక ముక్కను విజయవాడ డివిజన్ లో కలిపారు. మరో ముక్కతో ఒడిసాలోని రాయగఢ కేంద్రంగా కొత్త డివిజన్ ఏర్పాటు చేస్తున్నారు. అంటే... విశాఖ కేంద్రంగా జోన్ ఉంటుందికానీ, డివిజన్ ఉండదు. ఇప్పటిదాకా డివిజన్ కేంద్రాన్ని జోన్‌గా అప్‌గ్రేడ్ చేసినప్పుడు, డివిజన్లను యథాతథంగానే ఉంచారు. ఇప్పుడు వాల్తేరు విషయంలో కొత్త సంప్రదాయానికి తెరలేపారు. విశాఖ జోన్‌గా ఉన్నప్పటికీ... డివిజన్ లేకపోతే సమన్వయం కష్టమవుతుందని అధికారులు చెబుతున్నారు. వాల్తేర్ డివిజన్ ఆదాయంలో దేశంలోనే మూడో స్థానంలో ఉంది. గత ఏడాది రూ.7,500 కోట్ల ఆదాయం సంపాదించి పెట్టింది. కోరాపుట్, కిరండోల్ లైన్‌ల పరిధిలో బైలదిల్లా గనుల నుంచి ఇనుప ఖనిజం రవాణాయే ఇందుకు కారణం. రైల్వే జోన్లకు ఎంత ఆదాయం వచ్చినప్పటికీ ఆదాయాన్ని బట్టి జోన్లకు నిధుల కేటాయింపులు జరగవు. కేంద్రం ఇవ్వాలనుకున్నదే ఇస్తుంది. ఏ జోన్‌కి వచ్చిన సొమ్మైనా నేరుగా భారతీయ రైల్వేలకే వెళుతుంది. అయితే జోన్ ఏర్పడడం వల్ల, ఆ జనరల్ మేనేజర్‌కి కొన్ని స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే అధికారం ఉంటుంది. జీఎం సొంతంగా కొన్ని నిధులు ఖర్చు పెట్టవచ్చు. పైగా తన పరిధిలో ఉన్న రాష్ట్రంతో సమన్వయం చేసుకోవడం సులువు అవుతుంది. ఇప్పటి వరకూ ఆంధ్రా ప్రభుత్వం రైల్వేల గురించి మాట్లాడాలంటే సికింద్రాబాద్‌లోని జనరల్ మేనేజర్‌తో మాట్లాడాలి. కానీ ఇకపై విశాఖతో మాట్లాడాలి. అటు ఆ జోనల్ మేనేజర్ కూడా ఆంధ్ర పరిధిలో జరగాల్సిన పనులపై ఎక్కువ దృష్టి పెట్టి కేంద్రానికి తగిన నివేదికలు, సిఫార్సులు పంపే అవకాశం ఉన్నా, నిర్ణయాధికారం మాత్రం ఢిల్లీదే. విశాఖ ప్రాంతాన్ని విజయవాడ డివిజన్లో కలిపే బదులు వాల్తేరు డివిజన్ యదాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేస్తోంది దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్. విభజించడం వల్ల ఉత్తరాంధ్ర వారికి అన్యాయం జరుగుతుందని యూనియన్ వాదిస్తోంది. ప్రస్తుత జోన్‌తో విశాఖలో కొత్తగా ఒక జనరల్ మేనేజర్ పదవి సృష్టించి అతనికి అక్కడ ఒక కార్యాలయం నిర్మిస్తారు. ఇకపై ఆ పరిధిలోని రైల్వే పాలన సికింద్రాబాద్ నుంచి కాకుండా విశాఖపట్నం నుంచి జరుగుతుంది. రైల్వే జోన్ వస్తే అతి తక్కువ సంఖ్యలో మాత్రమే కొత్త పోస్టులు ఏర్పడే అవకాశం ఉందని అధికారులు వివరిస్తున్నారు. సికింద్రాబాద్ కేంద్రంగా ఉన్న దక్షిణ మధ్య రైల్వేలో ఆంధ్ర ప్రాంతాన్ని కవర్ చేసే విజయవాడ, గుంటూరు, గుంతకల్లు డివిజన్లు ఉండేవి. భువనేశ్వర్ కేంద్రంగా ఉన్న తూర్పు తీర రైల్వేలో ఉత్తరాంధ్ర భాగం విశాఖ నగరం కవర్ చేసే వాల్తేరు డివిజన్ ఉండేది. శ్రీకాకుళం జిల్లా సగం వాల్తేరు డివిజన్లో, సగం ఖుర్దా రోడ్ డివిజన్లో ఉండేది. దీంతో భువనేశ్వర్ పెత్తనం భరించలేని ఉత్తరాంధ్ర వాసులు విశాఖలోనే కొత్త జోన్ ఏర్పాటు చేసి అందులో కలపాలని డిమాండు చేస్తున్నారు. డివిజన్‌తో వచ్చిన సమస్యల కారణంగానే కొత్త జోన్ డిమాండుకు దారితీస్తే సమస్యను పరిష్కరించకుండా కొత్త జోన్ ఏర్పాటు చేయడం రాష్ట్ర ప్రజలకు ఆగ్రహం తెప్పిస్తోంది.

ఒడిశా వివక్ష

నిజానికి రైల్వేల సరిహద్దులు సరిగ్గా రాష్ట్రాల సరిహద్దుల్లా ఉండడం సాధ్యం కాదు. పరిపాలన

- మిగతా 2 లో

మంగళగిరిలోని శ్రీ పానకాల లక్ష్మీ నరసింహస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు 11నుంచి ప్రారంభమవుతున్నాయి. ఈ సందర్భంగా 'రాజధాని వార్తలు' మంగళగిరి వైభవం, పుణ్యక్షేత్ర చరిత్ర అనే ప్రత్యేక సంచికను ప్రచురిస్తున్నారు. ఈ ప్రత్యేక సంచికకు ప్రకటనలు ఇచ్చువారు ఈ క్రింది నంబర్లకు ఫోన్ చేయవచ్చు.
ఫోన్ : 98480 89624
76809 94755

ఘనంగా ముగిసిన

ఎస్ఆర్ఎం టెక్‌ఫెస్ట్

హ్యాకథాన్ టీమ్‌కు టెక్‌ఫెస్ట్ - 2019 బహుమతి

టెక్‌ఫెస్ట్ -2019 టైటిల్‌ను దక్కించుకున్న ఎస్ఆర్ఎం జట్టుకు జ్ఞాపికలతో పాటు నగదు బహుమతిని అందజేస్తున్న ప్రో వైస్ ఛాన్సలర్ డాక్టర్. డి.నారాయణరావు

జ్యోతి ప్రజ్వలన చేసిన ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్

రాజధాని వార్తలు, అమరావతి : ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో మొదలైన టెక్‌ఫెస్ట్ వేడుకలు ఘనంగా ముగిశాయి. ఈ టక్‌ఫెస్ట్‌ను ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ చంద్రశేఖర్ ప్రారంభించారు. ఎస్ఆర్ఎం హ్యాకథాన్ టీమ్‌కు ప్రతిష్టాత్మకంగా భావించే టెక్‌ఫెస్ట్-2019 టైటిల్ లభించింది. ఈ టీమ్‌లోని ఇంజినీరింగ్ విద్యార్థులు శ్రీవార్ధ, చైతన్య, రాహుల్, శ్రీనివాస్‌లు నగదు బహుమతితో పాటు జ్ఞాపికలను అందుకున్నారు. జరిగిన వేడుకల ముగింపు కార్యక్రమంలో ప్రోవైస్ ఛాన్సలర్ ఆచార్య డి. నారాయణరావు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. కాగా రోబోరేస్‌లో ఎస్ఆర్ఎం యూనివర్సిటీ విద్యార్థులు యశ్వంత్, నితీష్‌లు రెండో బహుమతిని కైవసం చేసుకున్నారు. డ్రోన్ రేస్‌లో ఏకే హౌలాధర్ కోడ్ రేస్‌లో రామమూర్తి, కోడ్ మోడలింగ్‌లో జే లక్ష్మన్ (విట్-ఏపీ)లు బహుమతులు దక్కించుకున్నారు. బెస్ట్ టీ షర్ట్ డిజైన్ పోటీలో తరుణి, జస్వంత్‌లకు ఉత్తమ బహుమతులు లభించాయి. ఫెస్ట్ బెస్ట్ స్టూడెంట్ అవార్డును కేఎల్‌యూకి చెందిన వీరాంజనేయులు కైవసం చేసుకున్నాడు. రెండు రోజుల పాటు జరిగిన టెక్‌ఫెస్ట్ ఈవెంట్‌లో 15 యూనివర్సిటీలకు చెందిన 800 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

టిడిపి సీనియర్ కౌన్సిలర్ ఉడతా శ్రీనివాసరావు కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన వైయస్ జగన్

మంగళగిరి వైసీపీలో ఉత్కంఠ

రాజధాని వార్తలు, మంగళగిరి : వైసీపీలో ఉడత శ్రీను, మునగపాటి వెంకటేశ్వర రావు, వంగర శకుంతల చేరికపై నియోజక వర్గ వైసీపీలో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తోంది. సీటు విషయంలో మంగళగిరి ఎమ్మెల్యే ఆర్కేకు వైసీపీ మొండి చెయ్యి చూపించనున్న నేపథ్యంలో పలువురు రాజీనామా బాట పట్టారు. జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో మంగళగిరి ఎంపీపీ పదవికి పచ్చల రత్నకుమారి రాజీనామా చేశారు. అలాగే మంగళగిరి వైసీపీ పట్టణ అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, మండల అధ్యక్షుడు మరి రెడ్డి శ్రీనివాసరెడ్డి, తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్ర ముక్కు వేణుగోపాల రెడ్డి, రూరల్ పార్టీ అధ్యక్షుడు పాటిబండ్ల కృష్ణమూర్తి, దుగ్గిరాల మండల అధ్యక్షుడు ఎడ్ల సాయి కృష్ణ తమ పార్టీ పదవులకు రాజీనామా చేశారు. వారి బాటలో పలువురు నేతలు కార్యకర్తలు పార్టీకి రాజీనామా చేయడానికి సిద్ధమవుతున్నారు. కాగా గృహప్రవేశం జరిగిన రెండు రోజుల వ్యవధిలోనే నేతల రాజీనామా పార్టీకి తీవ్ర నష్టం కలిగినట్లయింది. ఈ పరిణామం వైసీపీ అధినేత వైఎస్ జగన్‌కు తీవ్ర శరాఘాతంగా పేర్కొనవచ్చు. మంగళగిరి ఎమ్మెల్యే సీటుకు వైసీపీ పార్టీ తరపున పోటీచేసే అభ్యర్థులకు సంబంధించి వస్తున్న కథనాలకు స్పందిస్తూ.. ఆర్కే రానున్న ఎన్నికల్లో మంగళగిరి నుండి పోటీ చేస్తున్నట్లు చెప్పినట్లు సమాచారం.. రానున్న రోజుల్లో స్థానిక సంస్థల నుండి పరిధిలోకి తీసుకుని ఎమ్మెల్సీ ఇవ్వాలని కోరుతూ ఒక వర్గం వైసిపి నేత ఈ కౌన్సిలర్లకు పార్టీ తీర్థం ఇప్పించినట్లు సమాచారం...

లోక్‌సభ బరిలోకి కోడెల?

X

రాజధాని వార్తలు, అమరావతి : ఏపి శాసనసభా స్పీకర్ కోడెల శివ ప్రసాద్ లోక్‌సభ బరిలోకి దిగటం దాదాపు ఖాయమైంది. ఆయన ప్రస్తుతం గుంటూరు జిల్లా సత్తెనపల్లి ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇక, ఆయన తనయుడు శివరాంను నర్సరావు పేట ఎమ్మెల్యేగా బరిలోకి దింపాలని టిడిపి అధినేత నిర్ణయించారని తెలుస్తోంది.

స్పీకర్ కోడెల శివప్రసాద రావు రానున్న ఎన్నికల్లో నరసరావుపేట ఎంపీగా పోటీ చేయటం దాదాపు ఖాయమైంది. గత ఎన్నికల్లో ఆయన సత్తెనపల్లి అసెంబ్లీ నుండి వైసిపి నేత అంబటి రాంబాబు మీద గెలుపొందారు. సత్తెనపల్లి లో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. అయితే, పల్నాడు ప్రాంతంలో పట్టు ఉన్న కోడెలను నరసరావుపేట ఎంపీగా బరిలోకి దించటం ద్వారా మేలు జరుగుతుందని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. దీంతో..ఆయన ఎంపీగా బరిలోకి దిగనున్నారు. అయితే, తన కుటుంబానికి ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వాలని కోడెల ప్రతిపాదించినట్లుగా తెలుస్తోంది. ఇందు లో భాగంగా నరసరావుపేట ఎమ్మెల్యే సీటు ఇచ్చేందుకు సీఎం అంగీకరించినట్లు సమాచారం. ప్రస్తుతం నర్సరావు పేట ఎంపీగా ఉన్న రాయపాటి సాంబశివరావు వచ్చే ఎన్నికల్లో పోటీ చేయటానికి ఆరోగ్యం సహకరించటం లేదు.

రాయపాటి..కోడెల కుమారులకు అసెంబ్లీ సీట్లు..

ఎంపీగా కోడెల శివ ప్రసాద్ బరిలోకి దిగితే.. నరసరావుపేట ఎమ్మెల్యేగా ఆయన తనయుడు కోడెల శివరాం కు టిక్కెట్ ఖరారు కానుంది. ఈ మేరకు ఇప్పటికే ముఖ్యమంత్రి నుండి హామీ లభించినట్లు సమాచారం. ఇక ఈ ఎన్నికల్లో పోటీ నుండి దాదాపు దూరమవుతున్న రాయపాటి తనయుడికి సైతం అసెంబ్లీ సీటు ఇవ్వటానికి ముఖ్యమంత్రి అంగీకరిం చారు. అందులో భాగంగా..ఇప్పటి వరకు కోడెల ప్రాతినిధ్యం వహించిన సత్తెనపల్లి సీటును రాయపాటి కుమారుడైన రాయపాటి రంగారావుకు ఇచ్చే అవకాశం కనిపిస్తోంది.

కోడెల పై మోదుగుల పోటీ..!

నరసరావుపేట ఎంపీగా కోడెల బరిలోకి దిగటం ఖాయమైన పరిస్థితుల్లో ఆయన పై ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యే మోదుగుల వేణు గోపాలరెడ్డి వైసీపీ నుండి పోటీ చేసే అవకాశం కనిపిస్తోంది. మోదుగుల ప్రస్తుతం గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన వైసిపిలో చేరటం ఖాయమైంది. ఆయన సత్తెనపల్లి సీటు ఆశిస్తున్నప్పటికీ.. జగన్ మాత్రం మోదుగుల ను నర్సరావుపేట ఎంపీగా పోటీకి సిద్ధం కావాలని సూచించినట్లు విశ్వసనీయ సమాచారం. 2009 ఎన్నికల్లో మోదుగుల నరసరావుపేట ఎంపీగా నాటి కాంగ్రెస్ అభ్యర్థి బాలశౌరి పై విజయం సాధించారు. దీంతో.. ఇప్పుడు నర్సరావు పేట లోక్‌సభ బరిలో కోడెల వర్సెస్ మోదుగుల గా పోరు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.



నిరుద్యోగ భృతిని నేటి నుంచి రెట్టింపు చేస్తున్నాం!

ఏపీ సీఎం చంద్రబాబు

రాజధాని వార్తలు, అమరావతి : దేశానికి యువతీయువకులే వెన్నెముక అని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. యువత తమకు నచ్చిన రంగంలో రాణించి భవిష్యత్తును నిర్మించుకునేందుకు వీలుగా తమ ప్రభుత్వం 'ముఖ్యమంత్రి యువనేస్తం పథకాన్ని తీసుకొచ్చిందని అన్నారు. ఈ పథకం కింద అందిస్తున్న నిరుద్యోగ భృతిని నేటి నుంచి రెట్టింపు చేసి రూ.2,000 అందిస్తామని ప్రకటించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి ట్విట్టర్‌లో స్పందించారు.

చంద్రబాబూ.. కాచుకో.. ఏపీకి వస్తున్నా..

అసదుద్దీన్ ఒవైసీ కీలక ప్రకటన

రాజధాని వార్తలు, హైదరాబాద్ : ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి అసదుద్దీన్ ఒవైసీ హెచ్చరికలు పంపారు. 'చంద్రబాబూ... కాచుకో.. నేను ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్నా.. ఎన్నికల్లో జగన్ కు ప్రచారం చేస్తా' అని తెలిపారు. తెలంగాణలో టీఆర్ఎస్‌కు, ఏపీలో వైసీపీకి తమ మద్దతు ఉంటుందని అసదుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు. అంతకుముందు మాట్లాడుతూ.. పుల్వామా ఉగ్రదాడిలో భారత ఇంటెలిజెన్స్ వైఫల్యం కనిపిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆత్మాహుతి దాడులు, బాంబు దాడులను ఇస్లాం అంగీకరించదని తేల్చిచెప్పారు.

రాజధాని వార్తలు కలం

56 అంగుళాల ఛాతీ ఎవరిదీ?

దేశమంటే మట్టికాదు.. దేశమంటే మనుష్యులోయ్ అని గురజాడ తెలిపారు. మరి దేశభక్తంటే.. 56 అంగుళాల ఛాతీ కలిగి ఉండటమేనా ? వందేమాతరం అనడమా ? భారత్‌మాతాకి జై అని అనడమా ? మేం చెప్పిందే మీరు చేయాలని లేదంటే మిమ్మల్ని దేశద్రోహులుగా జమ చేస్తామని చెప్పడమా ? ఏరీ ఎక్కడున్నారు కుహనా దేశ భక్తులు ..

దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు తెగువ చూపి తన ప్రజలకు భరోసా కలిగించడం, శత్రు దేశాన్ని గడగడలాడించడం, కులం,మతం,ప్రాంతాలకు అతీతంగా ప్రజలను ఒక్కతాటిపైకి తేవడం.. ఏకత్వాన్ని నిలపడం.. అదీ దేశ భక్తంటే..

ఇమ్రాన్ అమాయత్వపు ముసుగు తీసేయ్.. ఇస్లాం ఎప్పుడూ సాటి మనిషిని చంపమని చెప్పలేదని మీది జైషే ఇ మహ్మద్ సంస్థకాదు.. జైషే సైతాన్ సంస్థని అసదుద్దీన్ గర్జించాడే అది దేశభక్తి అంటే.. 40 మంది వీర జవాన్లను పొట్టన బెట్టుకున్న మీరు మానవత్వంపై దాడి చేశాడని తేల్చిచెప్పాడే అది దేశభక్తంటే .. పాక్‌కు చెందిన ఓ మంత్రి భారత దేవాలయాల్లో గంట మోగకుండా చేస్తామని హెచ్చరిస్తే భారత్ గురించి ఏం తెలుసు ? ఈ దేశంలో ముస్లింలు బతికున్నతం కాలం మసీదుల్లో ఆజాన్, దేవాలయాల్లో గంటలు మోగుతూనే ఉంటాయి... ఇది మా దేశ గొప్పతనం..మా మధ్య భేదాభిప్రాయాలు ఉండవచ్చు కానీ.. దేశం జోలికి వస్తే మాత్రం మేమంతా ఒక్కటే.. అని తేల్చి చెప్పాడే అదీ దేశభక్తంటే.. ఐఏఎఫ్ పైలట్ విషయంలో మేం ప్రార్థనలు చేస్తున్నాం..మానవత్వంతో మెలిగి, అతన్ని వదిలేయాలని కోరుతున్నాం" అని ట్వీట్ చేశాడే ఒవైసీ అతనిదీ 56 అంగుళాల ఛాతీ అంటే.. దేశానికి భద్రత కల్పించే సైనికుల రక్షణను గాలికి వదిలేసి.. సర్జికల్ స్ట్రయిక్స్ చేసిన భారత జవాన్ల గుండె ధైర్యాన్ని మెచ్చుకోకుండా.. వారి త్యాగాలను తన 56 అంగుళాల ఛాతీదని నిస్సిగ్గుగా ప్రకటించుకుంటున్న మానసిక దుర్బలులు, ప్రజా వంచకులను దేశం అసహ్యించుకుంటోంది. అభినవ్ వర్థమాన్ పాకిస్థాన్ బందీగా పట్టుకుందని అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేస్తే.. ప్రధాని డుమ్మా.. దీనిపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. రెండో రోజు అతని విడుదల గురించి ఒక్కమాట మాట్లాడని ప్రధాని మోడీ బూత్ స్థాయి కార్యకర్తలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఎన్నికల్లో ఎలా గెలవాలా అని పార్టీ శ్రేణులకు చేస్తున్న ఉద్బోధనలను ప్రజాబాహుళ్యం నిరసిస్తోంది. జవాన్ల సమాధులపై అధికారపు పునాదులు లేపాలన్న కుతంత్రాన్ని వారు భీత్కరించుకుంటున్నారు.వారి పార్టీ సహచరుడేమో సర్జికల్ స్ట్రయిక్స్‌తో ఎన్ని సీట్లు వస్తాయో లెక్కించుకుంటున్నాడు..దేశంలో రక్షణ మంత్రి కనబడటం లేదు.. అయినా ఎప్పుడూ ఓట్ల కోసం, అధికారం కోసం నిసిగ్గుగా ప్రవర్తించేవారికి ఎంత ఛాతీ ఉంటే ఎంటి ?

కుటుంబాలకు దూరంగా, ఏక్షణం ఏంజరుగుతుందో తెలియని పరిస్థితుల మధ్య క్షణం ..క్షణం అప్రమత్తంగా పహారా కాస్తున్నారే.. వారిది 56 అంగుళాల ఛాతీ.. శత్రు శిబిరంలో చిక్కుకున్నా.. ధైర్యం కోల్పోని ఆ సింహం ఖంగు మనే గొంతు విని దేశ ప్రజల ఛాతీ 56 అంగుళాలకు చేరుకుంది. అది చాలు..

అయినా, దేశ ప్రథమ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూది 56 అంగుళాల ఛాతీ ఉండటం వల్లే పొరుగు దేశాలతో యుద్ధాలు చేశారా ? లాల్ బహదూర్ శాస్త్రి సంగతేంటి ? మరి పాక్, బంగ్లా యుద్ధాల్లో విజయభేరి మోగించిన అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ విషయమేంటి ? దేశ మంటే మనుష్యులు.. దేశాన్ని రక్షించేందుకు గుప్పెడంత గుండెల్లో భక్తి ఉంటే చాలు.. ఛాతీ లెక్కలు కాదు కావాల్సింది.

ఎన్నికల స్టంటేనా ?

ప్రధాని మోడీ గత ఆదివారం (ఫిబ్రవరి 18) అహ్మదాబాద్ కుంభమేళాలో పనిచేసిన ఐదుగురు స్వీపర్ల కాళ్లు కడిగిన వార్తలు, వీడియోలు బయటికి వచ్చాయి. ఏప్రధాని ఇంతటి మహోత్తమ కార్యక్రమం చేయలేదని బీజేపీ జబ్బలు చరచుకోవచ్చుకాని, దేశంలోని మైనార్టీలు, దళితులు నాలుగున్నరేళ్లపాటు గడ,గడలాడిపోయిన విషయం ప్రజలు మరచిపోయి ఉండరు. ఉన్నట్టుండి ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళా స్నానాలు చేసి, ఆపై కెమేరామెన్‌లు వీడియాలు తీస్తుండగా అత్యంత భక్తిశ్రద్ధలతో పారిశుద్ధ్య కార్మికుల కాళ్లు కడిగి, తెల్లటి టవల్‌తో తుడిచి, వారికి నమస్కారాలు చేసిన ప్రధాని మోడీ వీడియోపై సఫాయి కార్మికులు మాత్రం ఆగ్రహం వెలిబుచ్చుతున్నారు. ఇదొక రాజకీయ స్టంట్, రానున్న లోక్‌సభ ఎన్నికలను దష్టిలో పెట్టుకొని చేసినది. ఓట్ల కోసం ఆడిన డ్రామా'... అని మరుసటి రోజు ముంబై ఆజాద్ మైదానంలో ర్యాలీకి వచ్చిన పారిశుద్ధ్య కార్మికులు వ్యాఖ్యానించారు.అదే రోజు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద దేశం నలుమూలల నుంచి వచ్చిన వేలాది మంది పారిశుద్ధ్య కార్మికులు ధర్నాలు నిర్వహించారు.'ఇదంతా ఓట్ల కోసం.. మోడీకి మా పట్ల అంత ప్రేమ ఉంటే, మమ్మల్నీ సైనికుల్లా చూడాలి. విధి నిర్వహణలో చనిపోతే అమర వీరుల్లా గౌరవించాలి' అని హర్యానాలోని ఫరిదాబాద్ నుంచి ధర్నాకు వచ్చిన 30 ఏళ్ల రవి వాల్మికన్ వ్యాఖ్యానించారు. భద్రతా మాస్కులు, చేతులకు గ్లౌజులు, కాళ్లకు రక్షణ బూట్లు లేకుండానే తామంతా డ్రైనేజీ పనులు చేస్తున్నామని ఆయనతోపాటు వచ్చిన పారిశుద్ధ్య కార్మికులు తెలిపారు. ఏడవ వేతన సంఘం సిఫార్సుల మేరకు కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులందరికి కనీస వేతనాలను అమలు చేస్తామని మహారాష్ట్రలోని బీజేపీ ప్రభుత్వం 2015లోనే ఉత్తర్వులు జారీ చేసిందని, ఆ దిశగా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంతో తాము ప్రత్యక్ష ఆందోళనకు దిగాల్సి వచ్చిందని యూనియన్ నాయకులు తెలిపారు. మోడీకి తమ పట్ల ప్రేమ ఉంటే తాము ఎందుకు ఇంత దుర్భర పరిస్థితుల్లో బతుకుతామని వారు ప్రశ్నించారు. ఆధ్యాత్మిక సేవలో భాగంగానే ఐదుగురు పారిశుద్ధ్య కార్మికుల

ప్రపంచమంతా ఎప్పుడో చేతులుతో చేసే పారిశుద్ధ్యాన్ని నిషేధించగా, మన దేశంలో మాత్రం ఒకవైపు వారికి దుర్భరమైన పరిస్థితులు కల్పించి, ఎదగడానికి అవకాశం ఇవ్వకుండా అణచివేస్తూ, మరొపక్క వారిని మభ్యపెట్టే కబుర్లు చెబుతున్నాయి పాలక వర్గాలు. ఇది నిజమే అయితే నిమ్నవర్గాలు మాత్రమే ఈ పనిని ఎందుకు చేయాలి ? మిగతా సామాజిక వర్గాలు ఈ విధుల్లోకి ఎందుకు రావు ?

పాదాలను కడిగానని మోడీ చెప్పుకున్నారు. ఇదే విషయాన్ని 2010లో ప్రచురించిన 'కర్మయోగి' పుస్తకంలో రాశారు. 'బ్రతుకుతెరువు కోసం వారు ఈ పని చేస్తున్నారని నేను భావించడం లేదు. అలా అయితే మరో వృత్తి ఎన్నుకొనే వారు. తరతరాలుగా ఇదే వృత్తిలో ఎందుకు కొనసాగుతారు ?' అని ఆ పుస్తకంలో ఆయన తన అభిప్రాయాన్ని వెల్లడించారు.

2014 నుంచి 2016 మధ్య రెండేళ్ల కాలంలోనే డ్రైనేజీ క్లీనింగ్ పనిలో 1,327 మంది పారిశుద్ధ్య కార్మికులు మరణించినట్లు పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి. 2015 నుంచి అంతకుముందు ఆరేళ్ల కాలంలో ఒక్క ముంబై నగరంలోనే 1,386 మంది పారిశుద్ధ్య కార్మికులు విధినిర్వహణలో మరణించారని 'ఇండియాస్పెండ్' పరిశోధన సంస్థ 2015లో విడుదల చేసిన ఓ నివేదికలో వెల్లడించింది. వీరిలో 90 శాతం మంది కాంట్రాక్టు లేబర్లే. దేశంలో పాకిపనివారల వ్యవస్థను 2013, సెప్టెంబర్ నెలలో కేంద్ర కార్మిక శాఖ నిషేధించింది. దీన్ని కచ్చితంగా అమలు చేయడంతోపాటు పారిశుద్ధ్య కార్మికుల ప్రాణాలకు పూర్తి భద్రతనిచ్చే ఆధునిక పరికరాలను ఉపయోగించాలంటూ 2014, మార్చి 26న దేశంలోని అన్ని రాష్ట్రాలకు సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది.సుప్రీంకోర్టు ఉత్తర్వులను కచ్చితంగా అమలుచేసి ఉంటే ఇంతమంది పారిశుద్ధ్య కార్మికులు ఎందుకు చనిపోతారు? కాంట్రాక్టు పద్ధతిపై వారికి రోజుకు 200 రూపాయలు చెల్లిస్తున్నారు. ప్రాణ హాని లేదా అంగవైకల్య ప్రమాదాలకు ఆస్కారం ఉన్న విధులను ఎట్టి పరిస్థితుల్లో కాంట్రాక్టు కార్మికులను అప్పగించరాదంటూ 1947 నాటి పారిశ్రామిక వివాదాల పరిష్కార చట్టం నిర్దేశిస్తుండగా, డ్రైనేజీ పనులకు కాంట్రాక్టు కార్మికులను ఉపయోగిస్తే యజమానులకు ఏడాది జైలు, రెండు వేల రూపాయల జరిమానా విధిస్తామని 1993 నాటి చట్టం చెబుతోంది. దేశంలోని దాదాపు అన్ని మున్సిపాలిటీలు పారిశుద్ధ్య పనులకు కాంట్రాక్టు కార్మికులను ఉపయోగిస్తున్న విషయం తెల్సిందే.

మనకన్నా ఆర్థికంగా వెనకబడిన అనేక దేశాలు పారిశుద్ధ్య పనులకు ఆధునిక పరికరాలను ఉపయోగిస్తున్న విషయం తెల్సిందే. – ఖాన్

విద్యా,ఉద్యోగాల్లో సమాన అవకాశాలు కావాలి కాని, ఇలాంటి అచారాలు అక్కర్లేదు : పారిశుద్ధ్యపనివారు

మీ మురికి మనస్సును కడగండి : విల్సన్

వాస్తవానికి మోడీ ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం అమలుచేయకపోగా, పారిశుద్ధ్య కార్మికుల సహాయ పునరావాసాల కల్పనకు మంజూరు చేయాల్సిన నిధులను గణనీయంగా తగ్గించారు. మధ్యంత బడ్జెట్‌లో రూ.70 కోట్లను విడుదల చేయాల్సి ఉండగా, కేవలం రూ.30 కోట్లను మాత్రమే కేటాయించారు. పునారావాసం చట్టంప్రకారం ప్రతి ఒక్క కార్మికుడికి ఈ పని నుంచి విముక్తి కలిగించి గౌరవనీయమైన వృత్తిని చేపట్టేందుకు ఒక్కొక్కరికి నైపుణ్యాలను అభివృద్ధి చేసి పునరావాసం కల్పించడానికి రూ.15 లక్షలు కేటాయించాల్సి ఉంది. ఎప్పుడో నిషేధించాల్సి ఉన్న ఈ వృత్తిని కొనసాగించడం మానవత్వానికే మాయని మచ్చ. దేశవ్యాప్తంగా 45 వేల మంది పారిశుద్ధ్య పనివారు ఉన్నారని అంచనా.. ప్రభుత్వం 16 వేల మందికి పునరావాసం కల్పించామని చెబుతున్నా వివరాలు మాత్రం అందించడం లేదు. ఇప్పటివరకు కోర్టు ఆదేశాల మేరకు కేవలం 300 మందికి కూడా సహాయ పునరావాస కార్యక్రమాలు చేపట్టారని రామన్ మెగససే అవార్డు గ్రహీత, సఫాయి కర్మాచారి ఆందోళన్ జాతీయ కన్వీనర్ బెజవాడ విల్సన్ వెల్లడించారు. నాలుగునెలల్లో 12 మంది కార్మికులు చనిపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వారి కాళ్లను కాదు.. మొదట మురికి పట్టిన మీ మనస్సును కడక్కోండని మోడీకి సూచిస్తూ, ఇప్పటివరకు 1.6 లక్షల మంది మహిళలను ఈ వృత్తిలోకి బలవంతంగా దింపుతున్నారని, ఇలాంటి ప్రధానిని ఎక్కడా లేరని విల్సన్ మండిపడ్డారు.

విధి నిర్వహణలోనే భర్త అంత్యక్రియలు

చండీగఢ్ : ఓ వైపు వీరమరణం పొందిన భర్త.. మరోవైపు ఆగని కన్నీటి ధార.. అన్నింటినీ దిగమింగి అంత్యక్రియలకు హాజరైంది ఆ మహిళ. స్వతహాగా ఆమె కూడా పైలట్టే కావడంతో అంత్యక్రియలకు యూనిఫామ్ ధరించి హాజరైంది. వాయుసేన అధికారులతో కలిసి భర్తకు నివాళులు అర్పించింది. ఈ దృశ్యం అక్కడి వారిని కంటతడి పెట్టించింది.

జమ్ముకశ్మీర్‌లోని బుద్గామ్ జిల్లాలో ఎంఐ-17 ఛాపర్ కూలిన ఘటనలో ప్రాణాలు కోల్పోయిన స్క్వాడ్రన్ లీడర్ సిద్ధార్థ్ వశిష్ట్ అంత్యక్రియలు అధికార లాంఛనాలతో శుక్రవారం చండీగఢ్‌లో జరిగాయి. వశిష్ట్ భార్య ఆర్తీసింగ్ కూడా స్క్వాడ్రన్ లీడర్. భర్త అంత్యక్రియలకు ఆమె యూనిఫామ్‌తో హాజరై తన దేశభక్తిని చాటుకుంది. భారత వాయుసేన అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తుండగా.. ఐఏఎఫ్ అధికారులతో కలిసి కన్నీటితో తన భర్తకు ఆర్తి నివాళులు అర్పించింది. భారత జాతీయ పతాకాన్ని చేతపట్టుకుని భర్త పార్థివ దేహం వైపు చూస్తూ దీనంగా రోదించింది. అనంతరం వశిష్ట్ తండ్రి కుమారుడి చితికి నిప్పటించారు. చండీగఢ్ భాజపా అధ్యక్షుడు సంజయ్ టాండన్, హరియాణా మంత్రి నాయబ్ సైనీ ఈ అంత్యక్రియలకు హాజరయ్యారు.

మరో పోరాటం?

(మొదటిపేజీ తరువాయి)

పక్కాగా, పక్షపాతం లేకుండా జరిగితే ఏ సమస్యా ఉండదు. కానీ ఏ ప్రాంతం వారు ఆ ప్రాంత స్వార్థం చూసుకుంటేనే రైల్వే జోన్ల సమస్యలు వస్తుంటాయి.భువనేశ్వర్ కేంద్రంగా ఉన్న తూర్పు తీర రైల్వే ఒడిశాకు అనుకూలంగా ఉండి, ఉత్తరాంధ్ర ప్రజల డిమాండ్లు పట్టించుకోవడం లేదని ఇక్కడి వారి ఆరోపణ.ఆర్ఆర్‌బీ పరీక్షల కోసం భువనేశ్వర్ వెళ్లిన వారిని ఇబ్బంది పెట్టడం,విశాఖ వరకూ నడపాల్సిన రైళ్లను భువనేశ్వర్ వరకూ పొడిగించడం,ఉత్తరాంధ్ర ప్రాంతంలో రైల్వేల హాల్టులు తగ్గించడం,సరకు రవాణా కోసం అవసరమైనన్ని పెట్టెలు (బోగీలు) ఇవ్వకపోవడం,కొత్త రైళ్లు వేయడానికి ప్రతిపాదనలు పంపకపోవడం,ఇవన్నీ చేస్తూ తమపై వివక్ష చూపుతున్నారని విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం ప్రాంతాలకు చెందిన రైల్వే సిబ్బంది, నాయకులు ఆరోపిస్తూ వచ్చారు. అందుకే వారు తమ డివిజన్‌ను భువనేశ్వర్ నుంచి తప్పించాలని కోరారు.

మంత్రి ప్రకటన తప్ప ఏమీ లేదు

"విశాఖ రైల్వేజోన్‌పై కేంద్ర మంత్రి మండలి నిర్ణయం జరగలేదు. రైల్వే బోర్డ్ ప్రొసీడింగ్స్ జారీ కాలేదు. మంత్రి

ప్రకటన తప్ప ఏమీ లేదు. వారం పది రోజుల్లో ఎన్నికల కోడ్ వస్తోంది. ఈలోగా జోన్ ఏర్పడుతుందా?" అని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.'రాష్ట్రం మీద కేంద్రం కక్షతో వ్యవహరిస్తున్నట్టు కనిపిస్తోంది. జోన్ ఇచ్చి వాల్తేర్ డివిజన్ లేకుండా చేయడం.. పంచభక్ష్య పరమాన్నం పెట్టి చిన్న విషం చుక్క వేసిన చందంగా కనిపిస్తోంది. విశాఖ డివిజన్‌ను కాపాడుకోవాలి. అందుకు మళ్లీ ఉద్యమం చేస్తాం. దేశంలోనే ఆదాయ సముపార్జనలో విశాఖ డివిజన్ మూడో స్థానంలో ఉంది. దానిని విభజించడం తగదు. సంరక్షించుకోవడం కోసమే అందరం కలిసి పోరాటం దిశగా సాగుదాం" అని ఉత్తరాంధ్ర చర్చా వేదిక ప్రతినిధి కొణతాల రామకృష్ణ వెల్లడించారు.రాష్ట్రాల మధ్య చిచ్చుపెట్టారని నల్లచొక్కా వేసుకొని సీఎం చంద్రబాబు నిరసన తెలిపారు.

ప్రియమైన మిత్రులకి విన్నపం
ఇది పరీక్షల సమయం
విద్యార్థులు ఎవరైన
లిఫ్ట్ అడిగినా,డ్రాపింగ్ అడిగినా
దయచేసి సహాయం చేయండి
ఒక్క నిమిషం ఆలస్యం అయినా
పరీక్షకు అనుమతి లేదు

ఓం నమ:శివాయ

మహాశివరాత్రిని శైవులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. శివ-పార్వతి కల్యాణం జరిగిన రోజునే మహాశివరాత్రిగా పిలుచుకుంటారు. చాంద్రమాన నెల లెక్కింపు ప్రకారం అమావాస్య ముందు మాఘమాసంలో కృష్ణ పక్ష చతుర్దశి రోజు మహా శివరాత్రి జరుపుకొంటారు. హిందువుల పండుగలలో మహాశివరాత్రి ప్రశస్తమైనది. ఏటా మాఘ మాసం బహుళ చతుర్దశి నాడు చంద్రుడు శివుని జన్మనక్షత్రమైన ఆరుద్ర యుక్తుడైనప్పుడు వస్తుంది. శివుడు ఈ రోజు లింగాకారంగా ఆవిర్భవించాడని శివపురాణంలో ఉంది. చాంద్రమాన నెల లెక్క ప్రకారం, ఫిబ్రవరి లేదా మార్చి నెలలో ఈ పండుగ వస్తుంది. సంవత్సరంలో పన్నెండు శివరాత్రులలో మహా శివరాత్రి అత్యంత పవిత్ర మైంది.

బిల్వార్చన

పండుగనాడు బిల్వ (మారేడు) ఆకులు శివుడికి, సమర్పణలు ద్వారా జరుపుకుంటారు. రోజంతా ఉపవాసం ఉండి, రాత్రి అంతా జాగరణ చేస్తారు. ఇది శివ భక్తులకు అద్యంత పర్వదినం. శివభక్తులంతా తెల్లవారుజామున లేచి, స్నానం చేసి, పూజలు చేసి, ఉపవాసంతో రాత్రంతా జాగరణ చేస్తారు. మరునాడే ఇక భోజనం. రాత్రంతా శివ పూజలు, అభిషేకాలు, అర్చనలు, శివలీలా కథాపారాయణాలు జరుపుతారు. అన్ని శివక్షేత్రాలలో ఈ ఉత్సవం గొప్పగా జరుగుతుంది. పూర్వం శ్రీశైలం క్షేత్రంలో జరిగే ఉత్సవమును పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్రములో విపులంగా వర్ణించాడు. శైవులు ధరించే భస్మము, విభూతి తయారు చేయడం పవిత్రమైందని భావిస్తారు. రోజు అంతా భక్తులు "ఓం నమ: శివాయ", అని పవిత్ర మంత్రాన్ని పఠిస్తారు.

ఆధ్యాత్మిక శక్తి : తపస్సు, యోగాలను మంచిని చేయటానకి ముక్తి పొందడానికి నిర్వహిస్తారు. ఈ రోజు, ఉత్తర ధృవంలోని గ్రహస్థానాలు అంతా బలమైన ఉత్ప్రేరకాలు చర్యతో ఒక వ్యక్తి ఆధ్యాత్మిక శక్తి పెంచడానికి సహాయంగా ఉంటాయి. మహా మృత్యుంజయ మంత్రం వంటి శక్తి

వంతమైన పురాతన సంస్కృత మంత్రాల ప్రయోజనాలు శక్తి శివరాత్రి నాడు గొప్పగా పెరుగుతుంది.

శివుడికి ఇష్టమైన రోజు

భూమి యొక్క సృష్టి పూర్తి అయిన తరువాత, భక్తులు, పార్వతి దేవి కృతజ్ఞతలతో సంతోష పెడతామని శివుడ్ని కోరారు. అందుకు శివుడు జవాబుగా, అమావాస్య 14 రాత్రి, పాల్గుణ నెలలో కృష్ణ పక్షంలో, తన అభిమాన రోజు అని బదులిచ్చాడు. పార్వతి, ఆమె స్నేహితులకు ఈ పదాలు పునరావృతం చేసింది. వీరిలో నుండి ఆ పదం సృష్టి అంతా వ్యాపించింది.

శివరాత్రి పూజా విధానాలు

ఆ తరువాత బ్రహ్మ, విష్ణువు ఆదిగా గల దేవతలు శివుడిని ధూపదీపాలతో అర్చించారు. దీనికి మెచ్చిన శివుడు అక్కడి వారితో 'మీరీనాడు చేసిన పూజకు సంతసించితిని. ఈరోజు నుండి నేను అవతరించిన ఈ తిథి శివరాత్రి పర్వదినముగా ప్రసిద్ధి చెందింది. ఈ రోజున ఉపవాసము చేసి భక్తితో నన్ను లింగ రూపముగా, సాకార రూపముగా ఎవరు అర్చిస్తారో వారికి మహాఫలము కలుగుతుంది" అని చెప్పారు. తాను ఈ విధంగా అగ్ని లింగరూపముగా ఆవిర్భవించిన ప్రదేశము అరుణాచలముగా ప్రసిద్ధిచెందిందని

జాగరణ : జాగరణ అనగా అనగా ప్రకృతిలో నిద్రాణమైయున్న శివశక్తిని, శివ పూజా భజన లీలా శ్రవణాదులతో మేల్కొలిపి, తాను శివుడై, సర్వమును శివ స్వరూపముగా భావించి,దర్శించుటమే జాగరణము. అప్పుడు శివపూజలో సాయుజ్యము, శివభజనలో సామీప్యము, శివభక్తులతో కూడి, శివ విషయములు ప్రసంగించుటలో సలోక్యము, శివధ్యానముతో సారూప్యము సిద్దించునని ఆదిశంకరాచార్యులు మాట ప్రత్యక్ష సత్యమగును. ఈ నాలుగింటిని శివరాత్రి నాడు ప్రత్యక్షముగా సాధించుటయే శివరాత్రి జాగరణ. ఈ జాగరణ సమయంలో తామున్నగృహ ఆవరణలో, తమ స్వంత పంటపొలాల్లోనో అక్కడి మట్టితో అక్కడే శివలింగాన్ని తయారుచేస్తూ జాముకొక శివలింగం తయారుచేసి పూజిస్తారు. – బోస్

రుద్రాభిషేకం

వేదాలలో నుండి ప్రత్యేకమైన మంత్రాలను రుద్రసూక్తంగా పండితులచే పఠించబడుతుంది.దీనిని శివలింగానికి ప్రత:కాలంలో పవిత్రస్నానం చేయిస్తారు. దీనినే రుద్రాభిషేకం అంటారు. శివలింగంతో బాటు గండకీ నదిలో మాత్రమే లభించే సాలిగ్రామం కూడా పూజలందుంటుంది. దీనిద్వారా మనసులోని మలినాల్ని తొలగించుకోవడమే ఇందులోని పరమార్థం. పంచాక్షరీ మంత్రం : పంచాక్షరీ మంత్రం శివస్తోత్రాలతో అత్యుత్తమమైనది. ఈ మంత్రంలో పంచ అనగా అయిదు అక్షరాలను"న" "మ" "శి""వా""య" (ఓం నమశ్శివాయ) నిరంతరం భక్తితో మహాశివరాత్రినాడు పఠిస్తే శివసాయుజ్యం ప్రాప్తిస్తుంది.

FORM IV

Statement about ownership and other particulars about newspaper RAJADHANI VARTALU

1.Place of publication	: Rayapudi, Guntur District, AP
2.Periodicity of its publication	: Weekly
3.Printer's Name	: Pattan Hussain Khan
Nationality	: Indian
Address	: 6-45/1, Rayapudi Post, Guntur District, AP – 522237
4.Publisher's Name	: Pattan Hussain Khan
Nationality	: Indian
Address	: 6-45/1, Rayapudi Post, Guntur District, AP – 522237
5.Editor's Name	: Pattan Hussain Khan
Nationality	: Indian
Address	: 6-45/1, Rayapudi Post, Guntur District, AP – 522237
6.Names and addresses of Individuals who own the newspaper and partners or shareholders holding more than one percent of the total capital	: Vastitude Media Pvt.Ltd

I, Pattan Hussain Khan, here by declare that the particulars given above are true to the best of my knowledge and belief

Sd/ –
Pattan Hussain Khan
Signature of Publisher

Date : 3-3-2019

మంచి కోసం సమతుల్యం

అంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి8) నాడు ప్రపంచ మహిళలంతా తాము సాధించిన విజయాలతోపాటు, సమానత్వం దిశగా వెళ్లాలన్న ఈ వేడుకను జరుపుకుంటారు. తమ హక్కులను పరిరక్షించుకునే దిశలో మరింత సమర్థవంతంగా, బాధ్యతాయుతంగా ముందుకెళ్లే విధంగా అనేక నిర్ణయాలు తీసుకుంటారు. 1908 లో చికాగో మే 3 న తొలి మహిళా దినోత్సవం జరుపుకుంటున్నారు. 1909 లో, న్యూ యార్క్ ఫిబ్రవరి 28 న తొలి మహిళా దినోత్సవం జరుపుకునాన్నారు. అంతర్జాతీయ శ్రామిక మహిళా కార్మికులు 100 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 1911లో మొదటి

ఆమె

అంతర్జాతీయ మహిళా దినోత్సవం వివిధ దేశాల్లో జరుపుకున్నారు. మహిళలపై లైంగికదాడి, గృహ హింస అసమానత్వం రూపుమాపేందుకు మహిళా సంఘాలన్నీ ఏడాది పొడుగునా కార్యక్రమాలు చేపడతాయి. 2019 మహిళా దినోత్సవాన్ని మంచి కోసం సమతుల్యం (బ్యాలన్స్ ఫర్ బెట్టర్) నినాదంతో ముందుకు తీసుకువెళు తున్నారు. రానున్న రోజుల్లో సమాన గౌరవం, సమాన అవకాశాలు, సమాన ప్రాతినిధ్యం అందాలన్నదే ఈ నినాదం ముఖ్య ఉద్దేశం. క్షేత్ర స్థాయి నుంచి మహిళలకు సముచిత స్థానం కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. మహిళలు పనిచేసే చోట్ల సమతుల్యం పాటిస్తే మరింత మెరుగైన ఫలితాలను రాబట్ట వచ్చని సామాజిక వేత్తలు చెబుతున్నారు. సమష్టి కృషితో మరింత మెరుగైన సమాజాన్ని తద్వారా ప్రపంచాన్ని రూపొందించడమే లక్ష్యంగా మహిళలు ముందుకు సాగుతున్నారు. మహిళాసాధికారతతోపాటు, వ్యాపారాలు, ప్రభుత్వంలో చోటు, మీడియా కవరేజ్‌లో మహిళలకు స్థానం, ఉద్యోగాల్లో సమాన అవకాశాలు, పురుష క్రీడలతోపాటు మహిళా క్రీడలకు కూడా గుర్తింపునివ్వడం, సమాసపనికి సమాన వేతనం వంటి లక్ష్యాలతో ఈఏడాది మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ప్రసిద్ధ ఫెమినిస్టు, జర్నలిస్టు, సామాజిక కార్యకర్త గ్లోరియా స్టీనమ్ మాట్లాడుతూ మహిళా సమానత్వం ఒక మహిళలకు సంబంధించిన అంశం కాదని, మానవ హక్కులనే మహిళా హక్కులుగా గుర్తించాలన్నారు.

అమ్మమ్మ, అమ్మ, అక్క, అత్త,చెల్లి, భార్యగా ప్రేమాభిమానాలను పంచే ఆమె మరెవరో కాదు.. ఒక మహిళ.. ఆమెను గౌరవిచడం మన విధి.

పరీక్ష రాస్తూ ఇంటర్ విద్యార్థి మృతి

సికింద్రాబాద్ : ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రంలో విషాదం చోటుచేసుకుంది. పరీక్ష రాస్తూ ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థి మృతిచెందాడు. సికింద్రాబాద్ ప్యారడైజ్ సమీపంలోని శ్రీచైతన్య కళాశాలలో ఈ ఘటన చోటుచేసుకుంది. పరీక్ష రాస్తూ గోపీరాజ్ అనే విద్యార్థి ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అతడిని ఆస్పత్రికి తరలించేలోపే మృతిచెందాడు. గోపీరాజ్ ఎల్లారెడ్డిగూడ ప్రభుత్వ కళాశాలలో చదువుతున్నాడు. విషయం తెలిసి విద్యార్థి తండ్రి, సోదరుడు కళాశాలకు చేరుకుని విగతజీవిగా పడి ఉన్న గోపీరాజ్‌ను చూసి కన్నీటి పర్యంతమయ్యారు.

జెట్ ఎయిర్‌వేస్ ప్యాసింజర్లను అనుమతించం

న్యూఢిల్లీ : తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న జెట్ ఎయిర్‌వేస్ విమాన ప్రయాణికులను తీసుకెళ్లేందుకు ఎయిర్ ఇండియా నిరాకరించింది. సాధారణంగా టికెట్ బుక్ చేసుకున్న తర్వాత ఆ విమానం ఏదైనా కారణాల వల్ల రద్దయితే ఆ ప్రయాణికులను వేరే సంస్థల విమానాల్లో గమ్యస్థానాలకు చేరుస్తారు. అందుకు గానూ ప్రయాణికులను తీసుకెళ్లిన విమానయాన సంస్థకు రద్దైన విమానయాన సంస్థ చెల్లింపులు జరుపుతుంది. అయితే, ఇక మీదట జెట్ ఎయిర్‌వేస్ ప్రయాణికులను తాము అలా తీసుకెళ్లబోమని ఎయిర్ ఇండియా శుక్రవారం ఓ ప్రకటనలో తెలియజేసింది. ఇప్పటికే జెట్ ఎయిర్‌వేస్ సంస్థ ఆర్థికంగా సంక్షోభం ఎదుర్కొంటోంది. చెల్లింపులు జరపకపోవడంతో జెట్ ఎయిర్‌వేస్‌కు చెందిన 15 విమానాలు నిలిచిపోయాయి. ఈ సంస్థకు దాదాపు రూ.8,200 కోట్లు అప్పులు ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు తమ జీతాల చెల్లింపుల ఆలస్యంపై ఆ సంస్థ ఉద్యోగులు సైతం సంస్థపై ఒత్తిడి తీసుకొస్తున్నారు.

గుంటూరులో జరిగిన ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా గుంటూరు పశ్చిమ నాయకులు శ్రీ కోవెలమూడి రవీంద్ర (నాని) గారు పలు కుటుంబాలను కలిశారు. ఈ సందర్భంగా నాని గారు తెలుగుదేశం పార్టీని ప్రజలు మళ్లీ గెలిపిస్తేనే ప్రస్తుతం రాష్ట్రంలో పెద్ద ఎత్తున జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సజావుగా కొనసాగుతాయని తెలిపారు. అందరిని కలిసి వారి సమస్యలు పరిష్కరించడమే తమ ఉద్దేశమని, 80 శాతం ప్రజలు టీడీపీతో ఉండాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు.

- కిరణ్ కుమార్ గుంటూరు

గుంటూరులో లో బా. జ.పా ఇంటలేక్యూవల్ కన్వీనర్‌గా మాట్లాడుతూ . వేదిక పై కేంద్ర మానవ వనరుల శాఖా మంత్రి ప్రకాష్ జవదేకర్ , కన్నా లక్ష్మీనారాయణ , రంగరాజు, సత్యమూర్తి మరియు ఇతర నాయకులు .

- కిరణ్ కుమార్ గుంటూరు

స్టూడెంట్స్ మానిఫెస్ట్ విడుదల చేసిన విద్యార్థి నాయకులు

రాజధాని వార్తలు, అమరావతి : భారతదేశం ప్రపంచం లోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం. ఈ ప్రజాస్వామ్య వ్యవస్థ ప్రజలను వారి ప్రజా ప్రతినిధుల ద్వారా తమ సమస్యలు మరియు సవాళ్లను పరిష్కరించుకోవడం కోసం అవకాశం అందిస్తుంది. ప్రజలు వారి హక్కులను చట్ట సభల ద్వారా తీర్చుకోవడం కోసం వారిలో నుండి ఒక అభ్యర్థిని ఎన్నుకొని అవకాశాన్ని ఈ ఎన్నికలు కల్పిస్తాయి అని జాతీయ కార్యదర్శిసయ్యద్ అజహరుద్దీన్ అన్నారు. విజయవాడ ఎంజీ రోడ్డు లోని మీడియా హౌస్ ఆయన విలేకరుల సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భముగా విద్యార్థులు యువతకు కావలిసిన అంశాలతో పొందుపరిచినా మానిఫెస్ట్‌ను విడుదల చేసారు.

కార్పొరేట్‌లదే ఇష్టారాజ్యం

- విద్యా సంవత్సరం ముగిసినా..తనిఖీల్లేవ్
- అమలు కాని ఆర్టీఈ
- అర్హతలేని ఉపాధ్యాయులతో బోధన
- డొనేషన్ల నియంత్రణలో వైఫల్యం

రాజధాని వార్తలు బ్యూరో : విద్యాహక్కు చట్టం(ఆర్‌టీఈ) నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. ప్రవేశపరీక్షలు, డొనేషన్లను యథాతథంగా కొనసాగిస్తూ పెద్దఎత్తున సొమ్ము చేసుకుంటున్నారు. 6-14ఏళ్ల బాలలకు నిర్బంధవిద్య, విద్యా ప్రమాణాలను మెరుగుపర్చాలనే లక్ష్యంతో భారత ప్రభుత్వం ఆర్టీఈ-2009 చట్టాన్ని ప్రవేశపెట్టింది. ప్రారంభం నుంచి కార్పొరేట్/ ప్రైవేటు విద్యాసంస్థలు ఈ చట్టాన్ని అమలు చేయట్లేదు.దీంతో విద్యాప్రమాణాలు సన్నగిల్లుతున్నాయి.రాబోయే 2019-20 విద్యా సంవత్సరం ప్రవేశాలకుగాను కార్పొరేట్ విద్యా సంస్థలు ప్రవేశ పరీక్షలకు సన్నద్ధమయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 62,048 పాఠశాలలున్నాయి. ఇందులో 69,76,936 మంది విద్యార్థులు, 2లక్షల86,479 మంది టీచర్లు ఉన్నారు. 13జిల్లాల్లో కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలు-16,981 ఉన్నాయి. కృష్ణాజిల్లా-1,841, కర్నూలు-1,513, గుంటూరు-1,528, పశ్చిమగోదావరి-1,428 ప్రైవేటు పాఠశాలలు కొనసాగుతున్నాయి. ఇందులో పనిచేస్తున్న టీచర్లకు టెట్‌లో అర్హత లేకుండా బోధిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్టీఈని పటిష్టవంతంగా అమలు చేయట్లేదని, రాజకీయ ఒత్తిళ్లతో విద్యాశాఖ యంత్రాంగం పర్యవేక్షణ కొరవడిందని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. విద్యా ఏడాది పూర్తవుతున్నప్పటికీ..రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు నిర్వహించడంలో

అధికారులు వైఫల్యం చెందారని తూర్పారబడుతున్నారు.

ఉచిత ప్రవేశాలపై విద్యాశాఖ మౌనం..

ఆర్టీఈ చట్టం ప్రకారం కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థల్లో వెనుకబడిన వర్గాల బాలలకు ఒకటో తరగతి నుంచి 25శాతం ప్రవేశాలు కల్పించాలి. వీరిలో అనాథలు/ హెచ్ఐవీ/ వికలాంగులు /వీధిబాలలకు-5శాతం, ఎస్సీ బాలలు-10శాతం, ఎస్టీలు-4శాతం, ఓబీసీ, మైనార్టీ, ఓసీలు-6శాతం చొప్పున సీట్లను ఉచితంగా కేటాయించాలి. 13జిల్లాల్లో ఎక్కడా ఈ విధానం అమలుకు నోచుకోవట్లేదు. వీటిని సైతం పూర్తిస్థాయి ఫీజులతో ప్రైవేటు యాజమాన్యం భర్తీ చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పేరొందిన కార్పొరేట్ విద్యాసంస్థలు నగరాలకు, పట్టణాలతోపాటు మండల ప్రాంతాలకు కూడా విస్తరిస్తున్నాయి. విచ్చలవిడిగా కార్పొరేట్ విద్యాసంస్థలకు అనుమతులు జారీచేయడంతో ప్రభుత్వ పాఠశాలలు మూతపడే ప్రమాదం పొంచి ఉంది. దీంతో పేద పిల్లలు విద్యకు దూరమవుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

విచ్చలవిడిగా డొనేషన్లు

ఎల్‌కేజీ, యూకేజీల ప్రవేశాల నుంచే కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యం విచ్చలవిడిగా డొనేషన్లు వసూలు చేస్తున్నాయి. ఎక్కడా డొనేషన్లు వసూలు చేయొద్దని, కేవలం బోధనా ఫీజులే వసూలు చేయాలని చట్టంలో పొందుపరిచినా ప్రయోజనం లేకుండా పోయింది. ఎవరైనా డొనేషన్లు తీసుకున్నట్లు రుజువైతే..వారి నుంచి పది రెట్లు వసూలు చేయాలి. పాఠశాలల్లో ప్రవేశపరీక్షలు నిర్వహిస్తే..మొదటి తప్పుగా రూ.25వేల జరిమానా, అదే పాఠశాలలో రెండో విడత ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తే..రూ.50వేలు జరిమానా విధించాలని చట్టం చెబుతోంది. ఈ నిబంధనలను ఎవ్వరూ పాటించట్లేదు. దీనిపై విద్యాశాఖాధికారులకు ఫిర్యాదులు వెళ్లినా స్పందించట్లేదనే విమర్శలున్నాయి.

అర్హత పొందిన ఉపాధ్యాయులేరి..?

కార్పొరేట్ విద్యాసంస్థల్లో పూర్తిస్థాయి అర్హతలులేని వారితో విద్యాబోధన కొనసాగుతోంది. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు టెస్ట్, ఇంటర్ అర్హత ఉన్న మహిళా టీచర్లను తక్కువ వేతనాలకు యాజమాన్యం నియమించుకుని..వారితో బోధన కొనసాగిస్తోంది. ఆర్టీఈ ఆధారంగా ప్రైవేటు టీచర్లు సైతం టెట్(టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్)లో అర్హతపొందాలి. ప్రాథమిక స్థాయిలో బోధించే వారికి ఇంటర్+టీటీసీతోపాటు టెట్ అర్హత ఉండాలి. ఉన్నత తరగతులకు బోధించే టీచర్లకు సంబంధిత సబ్జెక్టులో డిగ్రీ+బీఈడీ చదవాలి. వీటిని అమలు చేయడంలో జిల్లాల విద్యాశాఖాధికారులు విఫలమయ్యారని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు. రాష్ట్రంలో ఆర్టీఈ చట్టాన్ని పటిష్టవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండు చేస్తున్నారు.

కృష్ణానదిపై రెండు వంతెనలు?

- మరోటి రోడ్ బ్రిడ్జ్‌గా నిర్మాణానికి సన్నాహాలు
- బిడ్ల సమర్పణకు ఈనెల 29వరకూ గడువు



రాజధాని వార్తలు, అమరావతి : రాష్ట్ర రాజధానిని జాతీయ రహదారులతో అనుసంధానం చేసే దిశగా ఏపీసీఆర్డీయే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అమరావతిని చెన్నై-కోల్‌కతా హైవేకు కలపడం ద్వారా రాజధానికే జీవనాడిగా నిలుస్తుందని ఆశించిన సీడ్‌యాక్సెస్ రోడ్డు ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దొండపాడు నుంచి వెంకటపాలెం సరిహద్దు వరకే పూర్తయిన ఈ రహదారి పెనుమాక, ఉండవల్లి గ్రామాల రైతులు ల్యాండ్ పూలింగ్ ప్రాతిపదికన భూములు ఇచ్చేందుకు ససేమిరా అనడంతో అసంపూర్తిగా మిగిలిపోయింది. దీంతో రాజధానిని కృష్ణానదికి ఆవలివైపున ఉన్న ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమ ప్రదేశానికి కలిపే ఐకానిక్ వంతెన నిర్మాణానికి జనవరిలో సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేయగా, పనులు ప్రారంభమయ్యాయి. అయితే ఏపీసీఆర్డీయే మరో 3 వంతెనలు నిర్మించాలని భావిస్తోంది. వీటిలో ఒకదాన్ని అమరావతిలోని ఎన్-13 రహదారిని ఎన్‌హెచ్-65 (విజయవాడ- హైదరాబాద్)కి కలుపుతూ కృష్ణానదిపై, రెండోదాన్ని కూడా కృష్ణానదిపైనే ఎన్‌హెచ్-65ను పాత జీటీ రోడ్డుతో అనుసంధానిస్తూ ప్రకాశం బ్యారేజీకి దిగువన, మూడోదానిని రోడ్ బ్రిడ్జ్‌గా అమరావతిలోని ఈ-13రోడ్డును చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారి-16తో కలుపుతూ నిర్మించే ప్రతిపాదనలను పరిశీలిస్తోంది. ఫీజిబిలిటీ నివేదిక, డీపీఆర్‌ను రూపొందించడానికి ఆసక్తి ఉన్న సంస్థల నుంచి బిడ్లను కోరింది. ఈ బిడ్ల సమర్పణకు ఈ నెల 29 వరకు గడువు ఇచ్చింది.

మీడియా హౌస్‌లో జాతీయ మహిళా పార్టీ సమావేశం

రాజధాని వార్తలు, విజయవాడ : ఎంజీ రోడ్ లో మీడియా హౌస్‌లో జాతీయ మహిళా పార్టీ రాబోయే ఎన్నికల్లో పోటీ చేసే విలేకరుల సమావేశం నిర్వహించారు. జాతీయ మహిళా పార్టీ అధ్యక్షురాలు తోపుల రాజేశ్వరి పాల్గొన్నారు. జాతీయ మహిళా పార్టీ సలహాదారలు కేథరిన్ మాట్లాడుతూ సమాజంలో మహిళలకు న్యాయం చేయాలనే ఆలోచనతో ఈ పార్టీ ప్రారంభించామని మహిళలకు జరిగినంతగా అన్యాయం మరి ఎవరికి జరగడం లేదన్నారు. మేము రాష్ట్రంలో ఉన్న 175 నియోజకవర్గ పరిధిలో పోటీ చేస్తామని తెలిపారు. అధికారం కోసం మేము ప్రాకులడలేదని కేవలం మహిళలకు న్యాయం చేయాలనే ఉద్దేశ్యంతో మేము ముందుకు వచ్చాము అని అన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో గుంటూరు జిల్లా చరిత్ర

రాజధాని వార్తలు, గుంటూరు : గుంటూరు జిల్లాకు ఆంధ్రప్రదేశ్‌లో ఘనమైన చరిత్ర ఉంది. రాష్ట్ర విభజన జరిగిన అనంతరం నవ్యాంధ్రప్రదేశ్‌గా ఏర్పడ్డాక ఆ చరిత్ర మరింత ఇనుమడించింది. నవ్యాంధ్ర రాజధాని అమరావతి గుంటూరు జిల్లాలో నిర్మాణం జరుగుతుంది. ఆ నాటి అమరావతి చరిత్రలో ఏ విధంగా సువర్ణాక్షరాలతో విభజించబడింది, మిగుల నిర్మాణం జరుగుతున్న అమరావతి కూడా అలాగే చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులుగా కొనసాగినా వారి విషయంలో కూడా గుంటూరు జిల్లా ఇప్పటికే చరిత్ర సృష్టించింది. 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పాడ్డాక 16 మంది ముఖ్యమంత్రులు నియమతులై. పాలన కొనసాగిస్తే వారిలో నలుగురు గుంటూరు జిల్లాలో జన్మించిన వారే కావడం విశేషం. 2013 వరకు ఆంధ్రప్రదేశ్‌గా కొనసాగిన 23 జిల్లాలో కలిగిన రాష్ట్రంలో గుంటూరు జిల్లాలో జన్మించిన నలుగురు ముఖ్యమంత్రులుగా కొనసాగారు. చరిత్రను సృష్టించారు. ఆ చరిత్రను మరొక జిల్లా అధిగమించే సూచనలు కనిపించడంలేదు. గుంటూరు జిల్లా చిరుమామిళ్ళలో జన్మించిన కాసు బ్రహ్మానంద రెడ్డి 1964 ఫిబ్రవరి 29న ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి, 1967 మార్చి 6 వరకు కొనసాగారు. 1967లో అసెంబ్లీ ఎన్నికల అనంతరం 1967 మార్చి 6 తరువాత రెండవ సారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చెప్పటి 1969 జూలై 18 వరకూ కొనసాగారు. 1969లో తెలంగాణ ఉద్యమం బ్రహ్మానందం రెడ్డికి తలనొప్పిగా తయారు అయింది. హైదరాబాద్‌లో 33 గంటల పాటు కర్ఫ్యూ విధించారు. బ్రహ్మానంద రెడ్డి మంత్రి వర్గంలోని తెలంగాణ మంత్రులు తమ పదవులకు రాజీనామా చెయటానికి సిద్ధపడారు. అది తెలిసిన ముఖ్యమంత్రి వారి ఎత్తుకు పై ఎత్తుగా తానే ముఖ్యమంత్రి పదవికి నాజీనామా చేసి, చరిత్ర సృష్టించారు. సమస్యను పరిష్కరించేందుకు కేంద్రంను అభిష్టానం పంపిణి ప్రతినిధి వర్గం హైదరాబాద్ వచ్చి కాంగ్రెస్ వాదులను సమావేశం పరిచారు. ఆ సమావేశం మళ్ళ బ్రహ్మనంద రెడ్డినే ముఖ్యమంత్రిగా ఎంపిక చేయటం కోసమెరుపు 1969 జూలై 19న బ్రహ్మనంద రెడ్డి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా మూడవ సారి ప్రమాణస్వీకారం చేసి చరిత్ర సృష్టించారు. 1964 ఫిబ్రవరి 29 నుంచి 1971 సెప్టెంబరు 30 వరకు సుమారు 7 ఏళ్ళ పది నెలలు ముఖ్యమంత్రిగా కొనసాగి చరిత్ర సృష్టించారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ముఖ్యమంత్రిగా బాధ్యత చేపట్టిన వారైవరూ అంత దీర్ఘ కాలం ముఖ్యమంత్రిగా కొనసాగలేదు.

గుంటూరు జిల్లా ముప్పాళ్ళలో జన్మించిన భవనం వెంకట్రమ్ (రెడ్డి) 1982 ఫిబ్రవరి 24న ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆ పదవి మూన్నాళ్ళముచ్చటగా ముగిసింది. 1982 సెప్టెంబర్ 20న అధిష్టానం ఆ దేశం మేరకు భవనం వెంకట్రమ్ రాజీనామా చేయవలసి వచ్చింది. ఆయన ముఖ్యమంత్రిగా కొనసాగింది. కేవలం 6 నెలల 26 రోజులు మాత్రమే కాంగ్రెస్ పార్టీ నుంచి ముఖ్యమంత్రిగా బాద్యతలు చేపట్టిన కొణిజేటి రోశయ్య గుంటూరు జిల్లా వేమూరులో జన్మించారు. 2009 సెప్టెంబర్ 3న ముఖ్యమంత్రిగా



బాధ్యతలు చేపట్టిన రోశయ్య 2010 నవంబర్ 24న అధిష్టానం ఆ దేశం మేరకు రాజీనామా సమర్పించారు. గుంటూరు జిల్లా నుంచి ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన నాల్గవ వ్యక్తి నాదెండ్ల భాస్కరరావు వీరు గుంటూరు జిల్లా దొనేపూడి జన్మించారు. వీరు కాంగ్రెస్ పార్టీ తరపున లేకుండా తెలుగు దేశం పార్టీ అభ్యర్థిగా ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టారు. వీరి పదవీ కేవలం 30 రోజుల ముచ్చటగా ముగిసిపోయింది. 1984 ఆగష్టు 16న ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాదెండ్ల భాస్కరరావు 1984 సెప్టెంబర్ 15న బాధ్యతల నుండి తప్పుకొని చరిత్ర సృష్టించారు. 60 ఏళ్లకు పైబడిన ఆంధ్రప్రదేశ్ చరిత్రలో కేవలం 30 రోజులు మాత్రమే ముఖ్యమంత్రిగా కొనసాగి దిగిపోవడం కూడా చరిత్రే.

1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పాటైనపుడు నీలం సంజీవ రెడ్డి ముఖ్యమంత్రిగా నియమతులయ్యరు. వీరు అనంతపురం జిల్లా ఇల్లూరుల్లో జన్మించారు. 1956 నవంబరు 1న ఆంధ్రప్రదేశ్ మొట్టమొదటి ముఖ్యమంత్రిగా బాధ్యత చెపట్టిన సంజీవ రెడ్డి 1957 ఏప్రిల్ 16 వరకు కొనసాగారు. 1957లో అసెంబ్లీ ఎన్నికల అనంతరం 1957 ఏప్రిల్ 17న మళ్ళీ సంజీవ రెడ్డి ముఖ్యమంత్రి బాధ్యతలు చెపట్టారు. 1962 వరకు ఆయన ముఖ్యమంత్రిగా కొనసాగి అవకాశం ఉన్నా అభిష్టానం అడ్డు తగిలింది. ఢిల్లీకి పివిబి,ఎఐసిసి, అధ్యక్ష పదవీని కట్టబెట్టి 1962 ఎన్నికల అనంతరం సంజీవ రెడ్డి 1962 మార్చి 12న మూడవసారి ముఖ్యమంత్రిగా నియమతులై 1964 ఫిబ్రవరి 28 వరకూ కొనసాగారు. ఈ సారి కూడా వారి పదవీకాలం మధ్యంతరంగానే ముగిసింది. కేంద్రం నుంచి పిలుపు రావటంతో సంజీవ రెడ్డి కేంద్ర మంత్రిగా చేరిపోయారు. అటు తర్వాత ఆయనకు రాష్ట్ర సంబంధాలు తగ్గిపోయాయి. కర్నూలు జిల్లా పెద్దపాకలో జన్మించిన దామోదరం సంజీవయ్య 1960 జనవరి 11న ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 1962 మార్చి 11 వరకూ కొనసాగారు. అటు తర్వాత ఆంధ్రప్రదేశ్‌కి చెందిన ముఖ్యమంత్రులో ఒకరైన కట్ట విజయభాస్కర్ రెడ్డి కూడా కర్నూలు జిల్లా లద్గగిరిలో జన్మించారు 1982 సెప్టెంబరు 20న ముఖ్యమంత్రిగా నియమితులై 1983 జనవరి 9 వరకూ కొనసాగారు. 1983 ఎన్నికల్లో కేంద్ర సేపా పార్టీ ఓటరు పాలు పంచుకోవటంతో ఆయన ముఖ్యమంత్రి వర్గనికి రాజీనామా చేయకతప్పలేదు. 1992 అక్టోబర్ 9 రెండవ సారి ముఖ్యమంత్రిగా నియమితులై 1994 డిసెంబర్ 12 వరకూ విజయభాస్కరరెడ్డి కొనసాగారు. నెల్లూరు జిల్లాలో జన్మించిన నెదురుమల్లి జనార్ధన రెడ్డి 1990 డిసెంబర్ 17 నుండి 1992 అక్టోబర్ 9 వరకూ కొనసాగారు. కడప జిల్లా పులివెందులలో జన్మించిన డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 2004 మే 14 నుండి 2009 మార్చి 15 వరకూ మొదటి సారి 2009 మార్చి 15 నుండి 2009 సెప్టెంబరు 2 వరకూ రెండు సార్లు ముఖ్యమంత్రిగా కొనసాగారు. చిత్తూరు జిల్లా నగిరిపల్లి లో జన్మించిన నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి 2010 డిసెంబర్ 1 నుండి 2014 మార్చి వరకూ ముఖ్యమంత్రిగా కొనసాగారు. చిత్తూరు జిల్లా కుప్పంలో జన్మించిన నారా చంద్రబాబు నాయుడు 1995 సెప్టెంబర్ 1 నుండి 1999 అక్టోబర్ 11 వరకూ ఎన్నికల అనంతరం 1999 అక్టోబర్ 11 నెలలు 2004 మే 14 వరకూ రెండవ సారి ముఖ్యమంత్రిగా తెలుగు దేశ పార్టీ తరపున కొనసాగారు. 2014 మార్చి 14న 3వ సారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి కొనసాగుతున్నాయి.

అమరావతి నిర్మాణంలో గుంటూరు జిల్లాలో ఎంత ప్రాధాన్యత ఉందో కృష్ణా జిల్లాలో కూడా అంతే ఉంది. కృష్ణా జిల్లా నిర్మాణంలో జన్మించిన నందమూరి తారకరామారావు తెలుగు దేశం పార్టీని స్థాపించిన ఏడాది గడవకుండానే కాంగ్రెస్ పార్టీని గద్దె దించి కాంగ్రెస్ నేతల ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి అరూప చరిత్ర సృష్టించారు. తెలుగుదేశంలో ముగ్గురు ముఖ్యమంత్రుల నియామకం జరిగింది. మిగిలిన వారంత కాంగ్రెస్ వారే 22 ఏళ్ల పాటు వారే ముఖ్యమంత్రులుగా కొనసాగటం కూడా చరిత్రే.

-దాసరి ఆళ్ళార స్వామి

స్వదేశంలో సింగం

ఈ దశాబ్దంలో అత్యంత అదృష్టవంతుడు అభినందన్ వర్ధన్ అనే చెప్పకోవాలి. లిప్తకాలంలో ఆక్రమిత పాక్ భూభాగంలో కాలుమోపి అక్కడి అల్లరిమూకల చేతుల్లో పరాభవానికి లోనైనా తమ ఆధీనంలో ఉన్నాడని పాక్ ప్రకటించడం, తర్వాతి రోజే విడుదలపై ప్రకటన చేయడం అందుకు ఉదాహరణ. రెండు రోజుల భారత ప్రజల ఉత్కంఠ తర్వాత అభినందన్ వాఘా సరిహద్దులో భారత్‌లో అడుగుపెట్టడంతో దేశవాసులంతతా పండుగ చేసుకున్నారు.



వింగ్ కమాండర్ అభినందన్ విడుదలకు సంతకాలు చేస్తున్న అధికారులు

అప్పటి పరిస్థితులను ఒకసారి పరిశీలిస్తే...పుల్వామా ఉగ్రవాద దాడి అనంతరం, భారత్ పాకిస్తాన్‌లోకి చొచ్చుకెళ్లి ఉగ్రవాద శిబిరాలపై దాడి చేసింది. ఈ నేపథ్యంలో భారత్ కీలక మిలటరీ స్థావరాలపై పాక్ దాడికి ప్రయత్నించగా, భారత్ సమర్థవంతంగాతిప్పికొట్టింది. బుధవారం ఉదయం మొత్తం 24 యుద్ధవిమానాలు ఒక్కసారిగా భారత్ భారత భూభాగంలోకి చొరబడ్డాయి. వాటిలో పాకిస్తాన్ ఎఫ్ 16లు, నాలుగు మిరాజ్ 3, నాలుగు జేఎఫ్ 17 విమానాలు నియంత్రణ రేఖ దాటి చొచ్చుకొచ్చాయి. వీటికి రక్షణగా మరికొన్ని విమానాలు నియంత్రణ రేఖకు అవతలవైపు సిద్ధంగా ఉన్నాయి. పాక్ విమానాలను భారత వాయు సేనకు చెందిన ఎనిమిది విమానాలు అడ్డుకొన్నాయి. వీటిల్లో నాలుగు సుఖోయ్ 30లు, రెండు మిరాజ్ 2000, రెండు మిగ్ 21 బైసన్‌లు ఉన్నాయి. జమ్మూకాశ్మీర్ లో నియంత్రణ రేఖను దాటుకుని భారత భూభాగంపైకి చొచ్చుకు వచ్చిన పాకిస్తాన్ వైమానిక దళానికి చెందిన ఎఫ్-16 ఎయిర్ క్రాఫ్ట్ ను తరిమి కొట్టడంలో, నేల కూల్చడంలో మనదేశ వాయుసేన వింగ్ కమాండర్ అభినందన్ అత్యంత ధైర్య సాహసాలను ప్రదర్శించారు.

నౌషెరా సెక్టార్ బేస్ క్యాంప్ నుంచి అభినందన్ మిగ్ 21 యుద్ధ విమానంతో శత్రువుల ఎయిర్ క్రాఫ్ట్‌లను నిరోధించారు. పాక్‌కు చెందిన ఎఫ్-16 భూమికి 8 వేల అడుగుల ఎత్తున ఉండగా.. అభినందన్ తన మిగ్ 21 యుద్ధ విమానాన్ని గంటకు 900 కిమీ వేగంతో 86 సెకన్లలో 15 వేల అడుగుల ఎత్తుకు తీసుకెళ్లి, అక్కడి నుంచి పాక్ ఎయిర్ క్రాఫ్ట్‌ను టార్గెట్‌గా చేసుకుని కాల్పులు జరిపారు. దీంతో అది తిరుగుముఖం పట్టింది. అయినప్పటికీ, అభినందన్ దాన్ని వదల్లేదు. నేను తరుముకుంటూ వారి వెనుకే వెళ్తున్నా.. అని మిగ్ 21లో అమర్చిన రేడియో ద్వారా మాట్లాడారు.

నియంత్రణ రేఖ దాటి, పాక్ గగనతలంలోకి ప్రవేశించిన క్షణాల వ్యవధిలోనే మిగ్ ఇంజిన్ స్తంభించింది. దీంతో పాకిస్తాన్ నియంత్రణ రేఖకు సుమారు ఏడు కిలోమీటర్ల దూరంలో అభినందన్ ప్యారాషూట్‌తో దిగినట్లు వెల్లడైంది. నియంత్రణ రేఖ సమీపంలో అభినందన్ మిగ్ 21 ద్వారా ఆర్ 73 క్షిపణిని ప్రయోగించారు. అది నేరుగా ఎఫ్ 16ను ఛేదించింది. దీంతో రెండు విమానాల్లో పైలట్లు ఎల్వోసీ అవతల నేలపైకి దిగడంతో ఇద్దరు పైలెట్లను బందీలుగా పట్టుకున్నామని పాక్ తొందరపాటులో ప్రకటించింది.

పాక్ పైలట్ స్వదేశీ భూభాగంపై క్షేమంగా దిగాడు. సైనిక దుస్తుల్లో ఉన్న ఆయన్ను స్థానికులు భారతీయుడని పొరపడ్డారు. భారత్ పై ఉన్న అనుచిత ఆవేశంతో వాస్తవాలు నిర్ధారించుకోకుండా సొంత పైలట్ పై దాడికి తెగబడ్డారు. పిడిగుద్దుల వర్షం కురిపించారు. రక్తమోడుతున్నా కనికరించలేదు. దీంతో తీవ్రంగా గాయపడ్డ పైలట్ అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. భారత పైలట్ స్థానికులకు చిక్కారన్న సమాచారం అందుకున్న పాక్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అసలు నిజం తెలుసుకొని ఖంగుతిన్నారు. ఆయన్ను ఆస్పత్రికి తరలించారు. ఆపై నాలుక కరుచుకొని.. అభినందన్ మాత్రమే తమ వద్ద బందీగా ఉన్నారని స్పష్టం చేశారు.

వాఘా సరిహద్దులో పాక్ అధికారులు

"నా దేశంలోకి అడుగు పెట్టగానే చాలా సంతోషంగా అనిపిస్తోంది"

ఆయనను భారత సరిహద్దు భద్రతాదళాలకు శుక్రవారం రాత్రి 9.20 గంటలకు అప్పగించారు.ఆ తరువాత వైమానిక దళ విమానంలో ఆయనను రాత్రి 12 గంటలకు ఢిల్లీ విమానాశ్రయానికి తీసుకువచ్చి, అక్కడి నుంచి వైద్య పరీక్షల కోసం ఎయిర్ ఫోర్స్ హాస్పిటల్‌కు తీసుకువెళ్ళారు. అతని ఫిట్‌నెస్‌కోసం కొన్ని వైద్య పరీక్షలు, మానసిక పరీక్షలు చేస్తున్నారు. శత్రువుల చెరలో అతను ఉండటం, కొన్ని రోజుల పాటు షాక్‌లో గడపడం వల్ల శత్రు దేశం మన రహస్యాలను తెలుసుకోవడానికి అతన్ని హింసించిందా అన్నది ఈ పరీక్షల ద్వారా చూస్తారు.పాకిస్థాన్ ఆర్మీ అతని శరీరంలో ఏమైనా ఉంచిందా అన్నది తెలుసుకోవడానికి వివిధ స్కాన్‌లు నిర్వహిస్తున్నారరు. ఇంటెలిజెన్స్ బ్యూరో, రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ (రా) కూడా అతన్ని ప్రశ్నించే అవకాశాలు ఉన్నాయి.

పుల్వామా దాడి అనంతరం భారత వైమానిక దళం పాకిస్తాన్ లోపల జైషే మొహమ్మద్ శిక్షణ శిబిరాలపై దాడి చేయటంతో భారత్-పాక్ మధ్య ఉద్రిక్తత పెరుగుతూ వస్తోంది.

ఐరాసకు ఫిర్యాదు చేస్తా: పాక్ హెచ్చరిక

పుల్వామా దాడికి ప్రతీకారంగా భారత్ వైమానిక దాడులతో తమ పర్యావరణానికి నష్టం కలిగించారని ఆరోపిస్తూ భారత్‌పై ఐక్యరాజ్య సమితికి ఫిర్యాదు చేసేందుకు పాకిస్తాన్ సిద్ధమైంది. వైమానిక దళం వేసిన బాంబుల కారణంగా తమ అడవిలోని పైన్ చెట్లు కూలిపోయాయని పాకిస్తాన్ మంత్రి మాలిక్ అమిన్ అస్లాం ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఇద్దరు రాయిటర్స్ రిపోర్టర్స్.. భారత్ బాంబు దాడులు జరిపిన ప్రదేశాన్ని సందర్శించారు. ఐరాస జనరల్ అసెంబ్లీ తీర్మానం 47/37 ప్రకారం మిలటరీ అవసరాల కోసం పర్యావరణాన్ని ధ్వంసం చేయడం అంతర్జాతీయ నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుంది. ఇప్పుడిదే నిబంధన ఆధారంగా భారత్‌పై పాక్ ఫిర్యాదు చేయబోతోంది.

పాకిస్తాన్ విదేశాంగ మంత్రి ఖురేషి:

"మూడు ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశామన్నారు? ఎక్కడున్నాయవి? 350 మందిని చంపేశామన్నారు... వాళ్ళ శవాలు ఏవి?"పాక్ భూభాగంలో భారత వైమానిక దళాలు జైషే స్థావరాలను ధ్వంసం చేశాయన్న వాదనలను కొట్టిపారేశారు.

టీవీ9 ఓవర్ యాక్షన్

టీవీ9 యాంకర్ మిలటరీ దుస్తులు ధరించి, బొమ్మ తుపాకీతో స్టుడియోను వార్‌రూంగా మార్చడంపై దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. జాతీయ మీడియా ఈ ఓవర్‌యాక్షన్‌ను ప్రస్తావిస్తూ, ఇంతకుముందు కూడా చాలా సందర్భల్లో ఇలాగే చేసిందని, ఈ పద్ధతి మానుకోవాలని సూచించింది. ఏది ఏమైనా భారత్-పాక్ ఉద్రిక్తతల నడుమ భారత్ మాధ్యమాలుయుద్ధరంగాన్ని సృష్టించాయని విదేశీ మీడియా వెల్లడించింది.

వింగ్ కమాండర్ అభినందన్ విడుదలను చిత్రీకరించేందుకు వచ్చిన జాతీయ మీడియా

ముఖ్య సంఘటనల తేదీలు

14 ఫిబ్రవరి 2019

సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్) జవాన్లతో ప్రయాణిస్తున్న కాన్వాయ్ మీద జమ్మూకశ్మీర్‌లోని పుల్వామా జిల్లాలో ఆత్మాహుతి బాంబర్ ఒక వాహనంతో ఢీకొట్టాడు. ఈ దాడిలో 40 మంది సీఆర్‌పీఎఫ్ సిబ్బంది చనిపోయారు. ఈ దాడి చేసింది తామేనని జైషే మొహమ్మద్ ప్రకటించింది.

17 ఫిబ్రవరి 2019

వివరాలు: ఢిల్లీలోని తన హైకమిషనర్‌ను పాకిస్తాన్ సంప్రదింపుల కోసం వెనక్కి పిలిపించింది.

18 ఫిబ్రవరి 2019

వివరాలు: భారత్ నియంత్రణలో ఉన్న కశ్మీర్‌లోని పుల్వామాలో తీవ్రవాదుల రహస్య స్థావరంగా చెప్తున్న ఒక నివాస ప్రాంతంలో జరిగిన ఎదురు కాల్పుల్లో నలుగురు భారత సైనికులు, ఒక పోలీస్ కానిస్టేబుల్ సహా తొమ్మిది మంది చనిపోయారు.

19 ఫిబ్రవరి 2019

వివరాలు: భారతదేశం "ఎటువంటి సాక్ష్యాలు, ఆధారాలు లేకుండా పాకిస్తాన్‌ను నిందించటం మానుకోవాలి" అని పాక్ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ అన్నారు. "చర్యలు చేపట్టదగిన సమాచారం" ఏదైనా ఉంటే తమకు అందించాలని భారత అధికారులను కోరారు. "పాకిస్తాన్ మీద ఎటువంటి దాడి అయినా ప్రారంభించగలమని మీరు అనుకునేట్లయితే.. తిప్పికొట్టటానికి పాకిస్తాన్ కూడా ఆలోచించదు, పాకిస్తాన్ తిప్పికొడుతుంది" అని కూడా ఆయన వ్యాఖ్యానించారు.

22 ఫిబ్రవరి 2019

వివరాలు: పుల్వామా దాడికి ప్రతీకారంగా జరగగల దాడుల నుంచి కశ్మీరీలకు, ముఖ్యంగా విద్యార్థులకు రక్షణ కల్పించాలని భారత సుప్రీంకోర్టు ప్రభుత్వానికి నిర్దేశించింది.

24 ఫిబ్రవరి 2019

వివరాలు: జమ్మూకశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు జైషే తీవ్రవాదులు, ఇద్దరు భద్రతా సిబ్బంది చనిపోయారు.

26 ఫిబ్రవరి 2019

వివరాలు: నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) ఆవల జైషే శిక్షణ శిబిరాల మీద 12 మిరేజ్ 2000, సుఖోయ్ ఎస్‌యూ-30 యుద్ధ విమానాలతో "సైనికేతర ముందస్తు చర్య" చేపట్టినట్లు భారత వైమానిక దళం ప్రకటించింది. ఎవరూ చనిపోలేదని పాకిస్తాన్ ప్రకటించింది.

27 ఫిబ్రవరి 2019

వివరాలు: భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ.. వైమానిక యుద్ధంలో ఒక మిగ్ 21 కోల్పోయామని, ఐఏఎఫ్ పైలట్ ఒకరు 'ఆపరేషన్‌లో గల్లంతు' అయ్యారని మీడియాకు వెల్లడించింది. పాకిస్తాన్ వైమానిక దళానికి చెందిన ఒక యుద్ధ విమానాన్ని తాము కూల్చివేశామని కూడా భారత్ తెలిపింది.

28 ఫిబ్రవరి 2019

వివరాలు: పాకిస్తాన్ నిర్బంధించిన భారత పైలట్‌ను ఒక 'శాంతి సంకేతం'గా విడుదల చేయనున్నట్లు పాక్ ప్రధానమంత్రి ఇమ్రాన్‌ఖాన్ ప్రకటించారు.

మార్చి 1

రాత్రి 9.21 గంటలకు అభినందన్‌ను పాకిస్థాన్ ప్రభుత్వం వాఘా సరిహద్దుల్లో భారత బీఎస్ఎఫ్‌కు అప్పగించింది. దీంతో దేశవాసులు సంబరాలు చేసుకున్నారు.

- ఖాన్

ప్రస్తుత పరిణామాలు తమకు కలిసొస్తాయని... కర్ణాటకలో బీజేపీ ఎక్కువ స్థానాలు సాధిస్తుందన్న ఆ పార్టీ నేత యడ్యూరప్ప వ్యాఖ్యలను పాకిస్థాన్ అధికార పార్టీ తెహ్రీక్ ఈ ఇన్సాఫ్ సోషల్ మీడియాలో పేర్కొన్న సంగతి తెలిసిందే.

పవన్ వివరణ

ఎన్నికలకు ముందు యుద్ధం వస్తుందని రెండేళ్ల క్రితమే బీజేపీ తనకు చెప్పిందని... దీన్ని బట్టి దేశంలో ఎలాంటి పరిస్థితుల్లో ఉందో అర్థం చేసుకోవచ్చంటూ కర్నూలు సభలో పవన్ చేసిన వ్యాఖ్యలను పాక్‌కు చెందిన డాన్ మీడియా తన వెబ్ సైట్‌లో పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను ప్రచురితం చేసింది.దీంతో ఆయన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారే అవకాశం ఉండటంతో స్వయంగా ఆయనే రంగంలోకి దిగి దీనికి ఫుల్ స్టాప్ పెట్టే ప్రయత్నం చేశారు. యుద్ధం వస్తుందని తనతో ఎవరూ చెప్పలేదని, మేధావులు, రాజకీయ విశ్లేషకులు చేసిన పలు విశ్లేషణల ఆధారంగానే తాను ఆ వ్యాఖ్యలు చేసినట్టు చెప్పారు. ఇంటర్నేషనల్ మీడియాను ఫాలో అయ్యేవారికి ఇదంతా తెలుస్తుందని.. అదే విషయాన్ని తాను ప్రస్తావించాను తప్ప.. తానేమి పాకిస్తాన్ వాళ్లు మాట్లాడుకుంటుంటే వినలేదని ఎద్దేవా చేశారు.

ప్రవాసాంధ్రుల కోసం ఉచిత భీమా పథకం

రాజధాని వార్తలు, విజయవాడ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రవాసాంధ్రుల కోసం ఉచిత భీమా పథకం అందిస్తుంది. ప్రవాసాంధ్ర భరోసా భీమా ద్వారా ప్రవాసాంధ్రులకు ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. విదేశాల్లో ఉద్యోగం లేదా చదువుకుంటున్నవారికి ప్రమాదవశాత్తు మరణం లేదా శాశ్వత అంగ వైకల్యం సంభవించినప్పుడు, ఉద్యోగం కోల్పోయినప్పుడు, న్యాయపరమైన సమస్యలు తలెత్తి వ్యయ భారం మీద పడినప్పుడు మీ అవసరాలను తీర్చడానికి ప్రవేశపెట్టబడినదే ఈ ఉచిత భీమా పథకం. భీమా ప్రయోజనాలను పొందాలనుకునేవారు www.apnrt.com/pravasandhraBharosaలో నమోదు అవ్వండి.

ఏపీ సర్కార్‌పై సంచలన ఆరోపణలు చేసిన మోహన్ బాబు



రాజధాని వార్తలు, తిరుపతి: 2014-15 నుంచి విద్యానికేతన్ విద్యార్థులకు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదంటూ మోహన్ బాబు ఆరోపించారు. ఇదే విషయంపై ప్రభుత్వానికి లేఖ రాసినా స్పందించలేదని దుయ్యబట్టారు. చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకోలేకపోయారని విమర్శించారు. విద్యాభివృద్ధిపై ఏపీ సర్కార్‌కు ఏమాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇంటింటికీ తిరిగి.. అమలు కాని హామీలెందుకు ఇస్తున్నారు? అంటూ మోహన్ బాబు ప్రశ్నించారు. తాను ఏ పార్టీకి చెందిన వ్యక్తిన కాదని, ఏ పార్టీ ప్రోత్సాహంతో తాను మాట్లాడటం లేదని ఆయన స్పష్టం చేశారు.

ఓటా.. నోటా?

రాజధాని వార్తలు, విజయవాడ : ప్రపంచం మొత్తంలో మన దేశం అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం. మరి ఈ దేశ భవిష్యత్తు అన్నది పరిపాలించబోయే నాయకుల ఎన్నిక మీద అధారపడి ఉన్నది. మరి ఆ ఎన్నికలు సరైన మార్గంలో జరగకపోయినా, లేదా డబ్బుకు దాసోహం అన్నట్టు మారినా దేశ భవిష్యత్తు , ప్రజల జీవితాలు సర్వనాశనం అయ్యే ప్రమాదం ఉంది. "ఓటుని నోటుతో చాల ఈజీగ కొనొచ్చు అనే చులకన భావంతో ఉన్న ఈనాటి కొంతమంది రాజకీయ నాయకులు - దేశ భవిష్యత్తును, తమ జీవితాలను మార్చే శక్తి ఉన్న ఓటును కేవలం కొద్ది రూపాయలకే అమ్మటానికి సిద్ధపడుతున్న కొంతమంది ఓటర్లు - ఓటు ను అమ్మటం వలన జరిగే పరిణామాలు ఎలా ఉంటాయి ? అనె కాన్సెప్టుతో ఈ లఘు చిత్రం నిర్మిస్తున్నట్టు ప్రముఖ లఘు చిత్రాల దర్శకుడు ఫిరోజ్ అహ్మద్ తెలిపారు. ఈ చిత్రానికి సంబంధించిన కాన్సెప్టు పోస్టర్‌ను లాయర్ మతీన్, అబ్దుల్ రహీమ్ మీడియా హౌస్‌లో నగర ప్రముఖులతో కలిసి విడుదల చెసారు. ఈ షార్ట్ ఫిలిం కొసం ప్రస్తుతం కాస్టింగ్ సెలక్షన్ జరుగుతుంది.

త్వరలో మీ ముందుకు లఘు చిత్రం

రాజధాని వార్తలు, విజయవాడ : విజయవాడలోని మహాత్మా గాంధీ రోడ్‌లో ఉన్న వాస్టిట్యూడ్ మీడియా హౌస్‌లో ఒక లఘుచిత్ర నిర్మాణం ఫిబ్రవరి 16వ తేదీన ప్రారంభమయింది. ఇంకా పేరు పెట్టని ఈ లఘు చిత్రానికి దగ్గుమాటి పద్మాకర్ కథ అందించారు. ప్రధాన పాత్రలో గుమ్మడి నాగేశ్వరరావు, హీరో హీరోయిన్లుగా లవకుమార్, ప్రజ్ఞ ఆలపాటి, మరొక పాత్రలో షేక్ మెహరున్నీసా నటించారు. మూడు రోజుల్లోనే నిర్మాణం పూర్తిచేసుకున్న ఈ లఘు చిత్రానికి ఛాయా గ్రహణం పామర్తి హరీష్, మేకప్ అక్కినేని నాగేశ్వరరావు అందించారు. సహకార దర్శకుడిగా దూపాటి తిరుమలేశ్వరరావు వ్యవహరించారు. గుమ్మడి ప్రేమ్‌చంద్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ లఘు చిత్రం ప్రస్తుతం గాంధీనగర్, విజయవాడలో ఉన్న వ్యూస్ స్టూడియోలో పోస్ట్ ప్రొడక్షన్ పనులలో ఉంది. త్వరలో ప్రేక్షకుల ముందుకు యూట్యూబ్‌లో రాబోతోంది.

నేను మంచి పోరాటము పోరాడితిని. నా పరుగు కడముట్టించితిని.
విశ్వాసము కాపాడుకొంటిని. తిమోతి 4 :7
జ్ఞాపకార్థ కూడిక

మా తల్లిగారైన
కీ॥శే॥పుట్టా శేషమ్మ గారు
ది.24-02-2019 ఆదివారం
ప్రభువునందు నిద్రించినారు.
కావున ది.04-3-2019 సోమవారం ఉ.11.00 గంటలకు గుంటూరు జిల్లా, తుళ్ళూరు, రాయపూడి గ్రామం, పర్మినెంట్ సచివాలయం దగ్గర గల మా స్వగృహమునందు "జ్ఞాపకార్థ కూడిక" జరుగును. కావున తెలియపరచడమైనది.

కుమారులు	కోడళ్ళు	కుమార్తెలు	అల్లుళ్లు
పుట్టా నాగేశ్వరరావు	వెంటకరత్నం	దున్నా భాగ్యలక్ష్మి	దున్నా అరుణరావు
" బాబురావు	దీప	కొండూరు రత్నకుమారి	కొండూరు రవికుమార్
" నాగరాజు	శ్రీలక్ష్మి		

మనుమలు- మనుమరాళ్ళు

చందాకొచ్చర్‌కు ఈడీ సమన్లు

ముంబై : ఐసీఐసీఐ బ్యాంకు మాజీ సీఈవో చందాకొచ్చర్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేసింది. వీడియోకాన్‌కు ఐసీఐసీఐ బ్యాంకు రుణ మంజూరు విషయమై విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. ఆమెతో పాటు వీడియోకాన్ ఎండీ వేణుగోపాల్ ధూత్‌ను కూడా విచారణకు హాజరు కావాల్సిందిగా పేర్కొంది. అంతకుముందు వీరి ఇళ్లు, కార్యాలయాల్లో శుక్రవారం ఈడీ సోదాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. 2012లో వీడియోకాన్ గ్రూప్‌నకు రూ.3250కోట్ల విలువైన రుణాలను మంజూరు చేసేందుకు క్విడ్‌ప్రోకో ప్రాతిపదికన సాయం చేసినట్లు చందాకొచ్చర్ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సీబీఐ, ఆదాయపు పన్ను శాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఐసీఐసీఐ కూడా స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించింది. ఈ క్రమంలో అవకతవకలు జరిగినట్టు ప్రాథమిక విచారణలో నిర్ధరించిన సీబీఐ వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. రుణ మంజూరుకు ప్రతిగా చందాకొచ్చర్ భర్త దీపక్ కొచ్చర్‌కు చెందిన కంపెనీల్లో వీడియోకాన్ పెట్టుబడులు పెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి.

ఈ నెల 5న మంత్రి మండలి సమావేశం

రాజధాని వార్తలు, అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి మండలి సమావేశం ఈ నెల 5వ తేదీన(మంగళవారం) జరగనుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠ చెప్పారు. ఈ మేరకు శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఈ నెల ఐదవ తేదీన ఉదయం 10.30 గంటలకు సచివాలయంలోని ఒకటో బ్లాక్ లో క్యాబినెట్ సమావేశ మందిరంలో మంత్రి మండలి సమావేశం జరుగుతుందని వెల్లడించారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan, RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2019-21, Cell 7680994755, Email : rajadhanivartalu1@gmail.com